

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక :236 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | వెల : 4/-

# హస్తంలో హై టెన్షన్!

- తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారిన ఢిల్లీ పరిణామాలు
- మంత్రులంతా ఢిల్లీ బాట పట్టడంతో వేడెక్కిన రాజకీయాలు...
- నేతలు ,మంత్రులు, ముఖ్యమంత్రులు ఢిల్లీ బాట పట్టడం చరిత్రలో తొలి సారి..
- మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా...?
- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి బెడ్తూ ఖాయమైందా...!!



హైదరాబాద్

ఒక్కసారిగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు హస్తినా బాట పట్టడం తో ఢిల్లీలో ఇంకా ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయా అన్న గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఎక్కడ చూసినా చర్చనీ యాంశంగా మారింది. మరికొంతమంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధిష్టానం ఉద్వాసన పలికి సీనియర్ నేతలకు అవకాశం కలగనిం దని.. మరి కొంతమంది కొండ సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని యోచిస్తున్నారని వీరిని అందుకే ఢిల్లీకి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో కొందరు వెల్లడిస్తున్నారు. అందువల్లనే పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, బట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తోపాటు మంత్రి వర్గాన్ని సీనియర్ నేతలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఉన్న - మిగతా3లో



## భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

- రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ వీడియో సందేశం
- రాహుల్ గాంధీకి పరోక్ష చురకలు
- విపక్షాల అసత్య ప్రచారాలకు జీడీపీ లెక్కలే సమాధానమన్న మోదీ

## బీజేపీ నాయకుల అరెస్టులు

# అప్రజాస్వామికం

- తెలంగాణలో బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్టులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది
- నల్గొండకు బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలను గృహ నిర్బంధంలో ఉంచడం అప్రజాస్వామికం
- ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుంది
- ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు

హైదరాబాద్

బీజేపీ కార్యకర్తల అరెస్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యం లో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుందని, కానీ తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, వైఫల్యాలను ప్రశ్నించినందుకు, జవాబుదా రీతనం కోరినందుకు ప్రతిపక్ష నాయకుల ను నిర్బంధిస్తున్నారంటూ కేంద్ర మంత్రి మండిపడ్డారు. బాధితులను పరామర్శించ డానికి నల్గొండకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ బీజేపీ నాయకులను గృహ - మిగతా3లో





## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

- 5 కొత్త కేటగిరీలు.. అక్టోబర్ 1 నుంచి రూ.200 ఛార్జీ!
- ఎన్‌పీఎస్ పథకాలకు కొత్త వర్గీకరణ విధానం
- ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు
- అక్టోబర్ 1 నుంచి రూ.200 చేరిక ఛార్జీ
- రూ.50 చొప్పున నాలుగు విడతల్లో వసూలు

# థౌజండ్‌వాలా



- వెయ్యి కౌంట్ దాటిన రేవంత్!
- గాంధీభవన్‌లో సంబురం..
- అపోజిషన్‌లో గరంగరం
- తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది.
- కాంగ్రెస్ సంబరాలు నిర్వహిస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.
- ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది.

హైదరాబాద్

రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా పవర్‌ఫుల్ ట్రంప్‌కార్డ్ చేతిలో ఉంది. రాష్ట్రం విడిపోయేటప్పుడు పవర్లో ఉన్న పార్టీగా మరో మేజర్ ఎడ్వాంటేజ్ కూడా ఉంది. కానీ, కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి.. అపోజిషన్‌కే పరిమితమైంది. అందుకే, థర్డ్ టైమ్ జరిగిన పోరులో జనామోదం పొంది థంపింగ్ విక్టరీ కొట్టి, ఆ కిక్కును ఫుల్‌టుఫుల్ ఎంజాయ్ చేసింది తెలంగాణలో హస్తం పార్టీ. అందుకే, రేవంత్ పాలనకు వందరోజులు పూర్తయినప్పుడు, ఏడాది కంప్లీట్ ఐనప్పుడు పెద్దసైజు జాతరలా ఘనంగా జరిగాయి సెలబ్రేషన్స్. విమర్శలొచ్చినా వెనక్కు చూడకుండా ముందుకే ఉరికారు సీఎం రేవంత్‌రెడ్డి. కట్‌చేస్తే, ఇప్పుడు వెయ్యిరోజుల మైల్‌స్టోన్‌ని టచ్ చేశారు. - మిగతా3లో


## 'శుద్ధీకరణ' పేరుతో సామాజిక అవమానం




- ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్‌లతో రాజకీయ ప్రతీకారం
- ఖర్గే నిలిచిన వేదికను 'శుద్ధి' చేయడం దళిత ఆత్మగౌరవంపై దాడి
- అంటరానితనాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులా?.. ఇదెక్కడి న్యాయం?:
- ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్

దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్– బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు మధ్య, ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనానికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత - మిగతా3లో



## విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరణ

- కఠిన చర్యలు ఉండవు : జేపీ నడ్డా
- సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలకు సంబంధించిన కేసులపై కేంద్రం కీలక ప్రకటన
- దిల్లీలో నమోదైన అన్ని కేసులను వెనక్కి తీసుకుంటామని నడ్డా వెల్లడి

# సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేత..
- ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు రద్దు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం
- ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడి



# భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజల సంకల్ప బలం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందంటూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పంచుకున్నారు. ఒకవైపు ఇరాన్ యుద్ధంతో ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయి, సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పటికీ భారత్ మాత్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని ఆ సందేశంలో వివరించారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోం కీ గూంజ్' క్యాంపెయిన్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కొందరి ఝూట్ కీ గూంజ్‌ను ప్రచారాన్ని ఛేదించుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని వివరించారు. వోకల్ ఫర్ లోకల్, వెడ్ ఇన్ ఇండియా మంత్రాన్ని పఠించాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు.

"భారతదేశంలో నిరాశలో కూరుకుపోయిన కొందరు వ్యక్తులు అబద్ధాలను ప్రచారం చేస్తూ, నలువైపులా నిరాశను వ్యాప్తి చేసే పనిలో పడ్డారు. వీటన్నింటినీ అధిగమించి, ఆ మాటలన్నింటినీ పటాపంచలు చేస్తూ మన దేశం 7.8% వృద్ధిని సాధించింది. మనం ఈ వృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలి. మనం ఇంకా ముందుకు సాగాలి, ఇందుకోసం ఆత్మనిర్భర్ భారత్‌గా మారడం చాలా అవసరం. స్వదేశీ మంత్రమైన 'వోకల్ ఫర్ లోకల్'ను పాటించాలి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లడం మానుకోవాలి. పెళ్లిళ్లు విదేశాల్లో చేసుకోకూడదు. 'వెడ్ ఇన్ ఇండియా' అనే మంత్రాన్ని ఆచరించాలి. అలాగే, అవసరం లేకపోతే బంగారం కూడా కొనుగోలు చేయకూడదు. మనం స్వదేశీ విధానాలపై ఎంతగా పట్టుబడితే, స్వయం సమృద్ధిపై ఎంతగా దృష్టి పెడితే మనకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే



నాటికి మన యువతకు 'వికసిత్ భారత్'ను అందిస్తామన్న పూర్తి నమ్మకం నాకుంది."

**'ముందు చూపు నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైంది'**

మోదీ ప్రభుత్వం ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాలే వల్లే 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధ్యమైందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్? షెకావత్ పేర్కొన్నారు.? "ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకున్న కీలకమైన నిర్ణయాలు వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రధాని తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను మార్చేశాయన్నారు. అలాగే, దేశాన్ని తయారీ రంగానికి కేంద్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విధానపరమైన సంస్కరణలు, వ్యాపార నిర్వహణను సులభతరం చేసేలా కల్పించిన అనుకూల వాతావరణం, ఇవన్నీ భారత్ పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణ కేంద్రంగా మార్చాయన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడిలో ఉన్నప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్న తరుణంలో భారత్ కూడా ఒత్తిడికి లోనవుతుందని చాలామంది భావించారు. కానీ వాటన్నింటి మధ్య ప్రధాని మోదీ వ్యవహరించిన తీరు కీలకమన్నారు.

**భారతీయుల కృషి, ఆకాంక్షలకు ప్రతిరూపం**

2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే భారత్ సాధించిన జీడీపీ వృద్ధిని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం ప్రశంసించారు. ఈ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్?లో పోస్టు పెట్టారు.? "2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8శాతం వాస్తవ జీడీపీ వృద్ధి, 10.3శాతం నామమాత్ర జీడీపీ వృద్ధి, 8.2శాతం వాస్తవ జీవీఏ వృద్ధి మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయి. ఈ గణాంకాలు 140 కోట్ల మంది భారతీయుల కృషి, ఆకాంక్షలు, ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపం. వివేకవంతమైన పాలన, నిర్ణయాత్మక విధాన రూపకల్పనల మద్దతుతో భారత్? సాధిస్తున్న సంస్కరణలు నరేంద్ర మోదీజీ దార్శనిక నాయకత్వాన్ని స్పష్టంగా కనిపిస్తుంది. మరింత బలమైన, పటిష్ఠమైన భారత్? 'వికసిత్ భారత్' దిశగా స్థిరంగా పురోగమిస్తోంది" అని రాసుకొచ్చారు.

**ఎన్‌డీఏ కూటమి పనితీరుకు నిదర్శనం**

మరోవైపు, భారత జీడీపీ వృద్ధిపై శివసేన నాయకురాలు షైనా ఎన్?సి మాట్లాడారు. జీడీపీ వృద్ధి అనేది నరేంద్ర మోదీజీ నేతృత్వంలోని ఎన్?డీఏ కూటమి పనితీరుకు నిదర్శనమన్నారు. ఓ వైపు ప్రపంచవ్యాప్తంగా పెద్ద యుద్ధాలు జరుగుతున్నా, సరఫరా గొలుసులకు అంతరాయం కలుగుతున్నా, భారత్? అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. ఇది ఒక అసాధ్యమైన కార్యమని, 140 కోట్ల మంది భారతీయులు మన సమష్టి బలాన్ని ప్రశంసించారని చెప్పారు.

# విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరణ

విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇటీవల దిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన అన్ని ఎఫ్?ఐఆర్?లను ఉపసంహరించుకుంటామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు విద్యార్థి నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లపై కీలక నిర్ణయం తీసుకున్న కొద్దిసేపటికే నడ్డా ఈ ప్రకటన చేశారు.

సీజేపీ సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసనను విరమించుకోవడాన్ని కేంద్ర మంత్రి నడ్డా స్వాగతించారు. ఈ నేపథ్యంలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సంప్రదింపులు జరిపిందని నడ్డా వెల్లడించారు. ఆయా రాష్ట్రాల పరిధిలో సీజేపీ నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని రాష్ట్రాలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం యువత సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ ఏడాది నీట్ పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా, జూన్ 20న జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆందోళన చేపట్టింది. అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఈ ఉద్యమం పలు నగరాలకు విస్తరించింది. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంటు ఆందోళనలో నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు జరిగాయి. చివరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో జులై 25న సీజేపీ ఈ ఆందోళనను విరమించింది. అయితే ఆ హామీలను కేంద్రం అమలు




చేయడం లేదంటూ సెప్టెంబర్ 5న మరోసారి మార్చ్‌కు సీజేపీ పిలుపునిచ్చింది.

ఎఫ్ఐఆర్‌లు కొట్టివేసిన సుప్రీంకోర్టు

కాగా, ఆందోళనల్లో పాల్గొన్న వారిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరగగా, విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కొట్టివేస్తూ మంగళవారం ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతరం కేంద్రం కూడా కేసుల ఉపసంహరణకు హామీ ఇచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, విద్యార్థుల ఆందోళనల అనంతరం సీజేపీ నాయకత్వానికి ఇచ్చిన మూడు హామీలను ప్రభుత్వం నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై జులై 20 నుంచి 25 వరకూ దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసులో కీలక ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒక విధానాన్ని రూపొందించాలని స్పష్టం చేసింది. యువ నిరసనకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి పూర్తి న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న అసాధారణ అధికారాల్ని వినియోగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అయితే కేంద్రం అభ్యర్థన మేరకు జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో పాల్గొన్న తీవ్రమైన నేరచరిత్ర కలిగిన 2,873 మందిపై మాత్రం ఎఫ్?ఐఆర్?లు నమోదు చేసేందుకు దిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ప్రాణనష్టం లేదా ఆస్తి విధ్వంసంలో వారి పాత్రపై దర్యాప్తు చేయాలని సూచించింది.


సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ హామీల నేపథ్యంలో సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసన మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీజేపీ కో–కన్వీనర్ సౌరవ్ దాస్? సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. సెప్టెంబర్ 5న దిల్లీలోని ఇండియా గేట్ నుంచి దిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత మార్చ్ నిర్వహించాలని గతంలో పార్టీ ప్రకటించింది. అయితే కేంద్రం ఇచ్చిన హామీ, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు సంబంధించిన చర్యల నేపథ్యంలో ఆ మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సీజేపీ నాయకుడు సౌరవ్ దాస్ ప్రకటించారు. విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో సీజేపీ మొదటి నుంచీ వారి తరఫున నిలిచిందని ఆయన తెలిపారు. దిల్లీ పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లను కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదని సుప్రీంకోర్టులో దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.

# 22 మంది ప్రాణాల్ని కాపాడిన టీ బ్రేక్
## నేపాల్ వరదల్లో కొట్టుకుపోకుండా ఆపింది ఆ 10 నిమిషాలే!

ఒక కప్పు టీ కోసం తీసుకున్న 10 నిమిషాల విరామం– 22 మంది ప్రాణాల్ని కాపాడింది. కైలాస– మానస సరోవర్ యాత్ర కోసం నేపాల్ మీదుగా టిబెట్‌కు వెళ్తున్న బెంగాల్‌లోని బర్ధమాన్‌కు చెందిన యాత్రికులు నేపాల్‌లో సంభవించిన భారీ ఫ్లాష్ ఫ్లడ్ నుంచి త్రుటిలో బయటపడ్డారు. తాము టీ కోసం ఆగకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవడానికి భయంగా ఉందని వారు చెబుతున్నారు. బర్ధమాన్‌కు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కళ్యాణ్ తా, వ్యాపారి బిప్లవ్ హాజ్రా సహా 22 మంది బృందంగా కైలాస– మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. ఆగస్ట్ 22న వారు కాఠ్‌మాండూకు చేరుకున్నారు. చైనా వీసాల కోసం ఎదురుచూస్తూ 2 రోజులు గడిచాయి. చివరికి ఆగస్ట్ 25 రాత్రి సుమారు 8.30 గంటలకు వీసాలు వచ్చాయి. వీసాలు వచ్చిన వెంటనే బయలుదేరాలని సూచించడంతో ఆగస్ట్ 26న ఉదయం 6.30 గంటలకు కాఠ్‌మాండూ నుంచి చైనా సరిహద్దు దిశగా ప్రయాణం ప్రారంభించారు.

జస్ట్ 10 నిమిషాల టీ బ్రేక్– అంతలోనే దూసుకొచ్చిన వరద సుమారు రెండున్నర గంటలు ప్రయాణించిన తర్వాత వాహనం ఒక ప్రాంతంలో ఆగింది. అందరూ కాసేపు విశ్రాంతి తీసుకొని టీ తాగారు. ఈ చిన్న విరామమే వారి జీవితాల్ని మార్చింది. టీ తాగిన తర్వాత తిరిగి వాహనంలోకి ఎక్కేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే స్థానిక పోలీసులు వారిని అక్కడి నుంచి త్వరగా వెళ్లిపోవాలని హెచ్చరించారు. అప్పటికి యాత్రికులకు వరద పరిస్థితి తీవ్రత గురించి తెలియదు. అంతలోనే కొండల వైపు నుంచి భయంకరమైన శబ్దం వినిపించింది. పైకి చూసిన వారికి తెల్లటి మేఘంలా ఏదో కొండ దిగువకు వేగంగా దూసుకొస్తున్నట్లు కనిపించింది. అయితే అది మేఘం కాదు. నీరు, మట్టి, ఇసుక, భారీ బండరాళ్లతో కూడిన ఫ్లాష్ ఫ్లడ్.

**పోలీసుల హెచ్చరికలతో పరుగులు!**



కళ్యాణ్ తా చెప్పిన వివరాల ప్రకారం– పోలీసులు చేతుల్లో కర్రలతో పరిగెత్తుతూ– 'పరిగెత్తండి.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి.' అంటూ వారిని హెచ్చరించారు. ఆ ప్రాంతం గురించి పెద్దగా అవగాహన లేకపోయినా 22 మంది బెంగాలీ యాత్రికులు స్థానికులతో కలిసి ఎత్తైన ప్రాంతం వైపు పరుగులు తీశారు. దాదాపు 200 మీటర్ల ఎత్తుతో ఉన్న ఒక కొండ ప్రాంతంపైకి భయంభయంగానే చేరుకున్నారు. తమకు స్థానికులతో పోలిస్తే అంతగా శారీరక సామర్థ్యాలు లేకపోయినా, ఆ సమయంలో ప్రాణాలు కాపాడుకోవాలనే భయమే తమను పరిగెత్తించిందని చెప్పారు. ఎత్తయిన ప్రాంతానికి చేరుకున్న తర్వాత కూడా వారి భయం తగ్గలేదు. తమ కళ్లముందే వాహనాలు, చెట్లు, ఇళ్లు, పశువులు, మనుషులు వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న దృశ్యాల్ని చూశారు. కళ్యాణ్ ఆ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ తాము నిజంగానే బతికే ఉన్నామా అనే నమ్మకం కూడా కొంత సేపటి వరకు కలగలేదని చెప్పారు. మరణాన్ని అంత దగ్గరగా ఎప్పుడూ చూడలేదని, సమయంలో మనిషి ప్రాణం కోసం చేసే పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. ఒక తల్లి తన బిడ్డ కోసం ఆందోళనగా వెతుకుతున్న దృశ్యం, ఒకరినొకరు పట్టుకొని ప్రాణాలు కాపాడుకునేందుకు స్థానికులు ప్రయత్నించడం వంటి ఘటనల్ని చూసినట్లు వెల్లడించారు.

ఇక ఈ ఘటన తర్వాత బిప్లవ్ హాజ్రా కూడా పదేపదే ఆ పది నిమిషాల టీ బ్రేక్ గురించే ఆలోచిస్తున్నారు. వాహనంలో కూర్చున్న సమయంలో తను టాయిలెట్‌కు వెళ్లాల్సి ఉందని చెప్పానని, అప్పుడు కళ్యాణ్ దా అందరం టీ తాగుదామని సూచించారని బిప్లవ్ తెలిపారు. దీంతో సుమారు 10 నిమిషాలు అక్కడే ఆగిపోయామని చెప్పారు. తాము కాస్త ముందే బయలుదేరి ఉంటే, లేదా టీ బ్రేక్ కోసం ఆగకపోయి ఉంటే ఫ్లాష్ ఫ్లడ్ వచ్చిన సమయంలో అదే బ్రిడ్జిపై ఉండేవారమని ఆయన చెప్పారు. తాము ఆగిన ప్రదేశం నుంచి ఆ బ్రిడ్జి కేవలం 6 లేదా 7 నిమిషాల దూరంలోనే ఉందని వివరించారు. తాము ముందుకు వెళ్లి ఉంటే రెండు బ్రిడ్జిల మధ్య చిక్కుకుపోయేవారమని, వెనుక బ్రిడ్జి కూలిపోగా, ముందున్న మరో బ్రిడ్జి కూడా వరదలో కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. చివరికి పరిస్థితులు కుదుటపడ్డాక ఆ 22 మంది యాత్రికులు యాత్ర రద్దు చేసుకొని తిరుగుపయనం అయ్యారు.

**సామూహిక ఖననాలు**

నేపాల్‌లో వరదల వినాశనం సృష్టించిన విషాదం రోజురోజుకూ మరింత భయానకంగా మారుతోంది. విపత్తు సంభవించి వారం రోజులు గడుస్తున్నా బురద, శిథిలాల కింద నుంచి మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. దీంతో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలోని ప్రధాన ఆస్పత్రులు, శ్మశానాలు మృతదేహాలతో నిండిపోయాయి. కొత్తగా వెలికితీస్తున్న డెడ్‌బాడీలను భద్రపరచడానికి స్థలం లేకపోవడంతో నేపాల్ ప్రభుత్వం కాఠ్‌మాండూలో సామూహిక ఖననాలు ప్రారంభించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మృతదేహాలు కుళ్లిపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**హైదారాబాద్/అమరావతి** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. ఢిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ పరిధిలో జంతర్‌మంతర్ వద్ద జూలై 20–25 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, ఈ నిర్ణయం అందరికీ వర్తించదు. గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా, 2,873 మందిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధి విధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్లు కోర్టు వ్యాఖ్యానించింది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80–100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ–ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60–80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–బి'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35–60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10–35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0–10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

## 'ఎకానమీపై మోదీ చేస్తున్న ప్రచారం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉంది'

ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. జీడీపీ వృద్ధిని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను షేర్ చేయడంపై దుయ్యబట్టారు. మోదీ ఆర్థిక వ్యవస్థపై చేస్తున్న ప్రచారం కేవలం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉందని విమర్శించారు. సామాన్య ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని, 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "దేశం జీడీపీ వృద్ధి సంబరాలు జరుపుకుంటోందని నరేంద్ర మోదీ చెబుతున్నారు. ఆ సౌకర్యం ఆయనకు ఉండొచ్చు. కానీ సామాన్యుడికి లేదు! సామాన్య ప్రజలు 3'ఖ'ల భారంతో ఉన్నారు. దానికి మోదీయే బాధ్యులు!. ఆ 3'ఖ'లు ఏంటంటే అనూహ్యమైన నిరుద్యోగం, భరించలేని ధరల పెరుగుదల, అదుపులేని అసమానత!. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. 2026 జులై నాటికి 15– 29 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఆరుగురు యువ భారతీయులలో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ వాగ్దానం భగ్నమైంది. రిటైల్ ద్రవ్యోల్బణం 19 నెలల గరిష్ఠానికి చేరింది. చక్కెర, ఉల్లి, టమాటా, పప్పుధాన్యాలు, వంట నూనె, బియ్యం, పాలు, ఇలా ప్రతి నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ ధరలు సాధారణ ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఎలాగోలా బతకడానికి పోరాడుతున్నాయి. పేదలు ఆశ వదులుకున్నారు" అలాగే సంపద అసమానతలపై కూడా మోదీ ప్రభుత్వాన్ని మల్లికార్జున ఖర్గే ఎండగట్టారు. బ్రిటిష్ పాలన కంటే దారుణమైన అసమానత దేశంలో ప్రస్తుతం ఉందన్నారు. దేశ మొత్తం సంపదలో 40శాతం ఒక శాతం మంది చేతిలోనే ఉందని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో పేదల నుంచి ధనికులకు సంపద బదిలీని మోదీ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. విచ్చలవిడి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే కేంద్ర సర్కార్ ఏకైక ఆర్థిక విధానమని ఎద్దేవా చేశారు.

**'తన సన్నిహిత మిత్రుడికి ట్రావెట్ ఏజెంట్‌గా మోదీ'**

"2014 నుంచి మోదీ ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ రుణాలను మాఫీ చేసింది. అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే రూ. 22,006 కోట్ల అంగీకరించిన క్లెయిమ్‌లకు గానూ రుణదాతలు కేవలం రూ. 6.5 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. అంటే 99.97శాతం రుణాన్ని వదులుకోవాల్సి వచ్చింది. భారత ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడికి వ్యక్తిగత ట్రావెల్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని దేశం చూసింది!. భారతీయులు బంగారం కొనొద్దని, విదేశాలకు వెళ్లొద్దని మోదీ పదేపదే చేసే ఉపన్యాసాలు క్షేత్రస్థాయి వాస్తవాలను తెలియజేస్తున్నాయి. వాస్తవం ఏమిటంటే ప్రజలకు అబద్ధాలు చెప్పే మీ సామర్థ్యం తప్ప మరేమీ మారలేదు!" అని ఖర్గే పేర్కొన్నారు.

**ఆ జీడీపీ వృద్ధి గణాంకాల గారడీయే : జైరాం రమేశ్**

మరోవైపు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీడీపీ గణాంకాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వృద్ధిని 'గణాంకాల గారడీ'గా అభివర్ణించారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం చాలా తక్కువ ఫలితాలను సాధించిందని, కానీ మోదీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఫేక్ ఇన్ ఇండియా' పథకం మాత్రం నిరాటంకంగా కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం దేశ దయనీయమైన ఆర్థిక వాస్తవికతను దాచిపెడుతూ జీడీపీ గణాంకాలను తారుమారు చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "నామమాత్రపు, వాస్తవ జీడీపీల మధ్య వ్యత్యాసం ద్రవ్యోల్బణాన్ని సూచిస్తుంది. అయితే ఆ తేడాను కేవలం 2.3శాతం మాత్రంగా ప్రభుత్వం చూపించింది. కానీ ఈ త్రైమాసికంలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం 9 శాతానికి పైగా ఉంది. ఇది స్పష్టమైన వ్యత్యాసం. ఈ ఏడాది జీడీపీని లెక్కించే పద్ధతిని రెండుసార్లు సవరించిన మోదీ ప్రభుత్వమే ఈ వ్యత్యాసాన్ని సృష్టించింది. మోదీ ప్రభుత్వం నిజాయితీతో కూడిన గణాంకాలను ఇచ్చి ఉంటే వాస్తవ వృద్ధి రేటు చాలా తక్కువగా ఉండేది. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారుతో సహా చాలా మంది గతంలోనే చెప్పారు"

**'ప్రజలకు మోదీ ప్రభుత్వం వారానికో షాక్ ఇస్తోంది'**

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి మోదీ ప్రభుత్వం భారీ షాక్ ఇస్తోందని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. అహంకారపూరిత మోదీ ప్రభుత్వం గణాంకాల గారడీ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే పనిలో నిమగ్నమై ఉందని విమర్శించారు. "మోదీ సర్కార్ ప్రతి వారం దేశానికి పెరుగుతున్న ధరల రూపంలో ఒక కొత్త, భారీ షాక్‌ను ఇస్తోంది. ద్రవ్యోల్బణం కేవలం వంటగదికే పరిమితం కాలేదు. ఇంటి నిర్మాణం నుంచి విద్యుత్ పరికరాల వరకు ప్రతి అంశంలోనూ పెరుగుతున్న ఖర్చుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు" అని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

# బీజేపీ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

-మొదటిపేజీ తరువాయి

నిర్బంధంలో ఉంచడం అత్యంత శోచనీయమని అన్నారు. కేవలం బాధితులను పరామర్శించడానికి వెళ్లినందుకే బీజేపీ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచాలా? వారిని ప్రజలను కలవకుండా అడ్డుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్షాల గొంతును అణచివేయడానికి పోలీసులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. నల్గొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడి జరిగినప్పుడు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నప్పుడు, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని కిషన్ రెడ్డి అన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన బీజేపీ నాయకులను అరెస్టు చేస్తూ, దాడులు చేసిన వారిని స్వేచ్ఛగా వదిలేయడం ఏం న్యాయమని విమర్శించారు.



తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. దాడులు ఎవరు చేశారో, బాధితులు ఎవరో, అధికారాన్ని ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో వారికి బాగా తెలుసని, తెలంగాణ తన చరిత్రలో ఎన్నో ప్రజా ఉద్యమాలకు సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం నిలబడిన ఈ గడ్డపై అక్రమ అరెస్టుల ద్వారా ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని తెలిపారు. బీజేపీ నాయకులను ఎన్నిసార్లు అరెస్టు చేసినా, నిర్బంధంలో ఉంచినా, ప్రజల కోసం మా పోరాటం ఆగదని, ప్రజలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం, అన్యాయాన్ని బహిర్గతం చేయడం, బాధితులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని అన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కేయగలమని ప్రభుత్వం భావిస్తే, అది తీవ్రంగా పొరబడుతున్నట్లే. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయాధికారులు ప్రజలే. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల హక్కులను కాపాడటానికి, బాధితులకు అండగా నిలబడటానికి బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ఎంతటి నిర్బంధం లేదా అణచివేత కూడా ప్రజల కోసం మా పోరాటాన్ని ఆపలేవు అంటూ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే ఇప్పుడు తొలగించినవే ఎక్కువ!


రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా రూపొందించిన ఓటర్ల తొలగింపు జాబితాలోని గణాంకాలను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో ప్రధానంగా మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో తొలగింపునకు గుర్తించిన (అనర్హులుగా భావించిన) వ్యక్తుల సంఖ్య 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వాస్తవంగా నమోదైన ఓట్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. గ్రేటర్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో చివరి అసెంబ్లీ ఎన్నికల సమయంలో 21,72,111 ఓట్లు పోల్ కాగా, ముసాయిదా తొలగింపు జాబితాలో 19,41,444 మంది వ్యక్తుల పేర్లను చేర్చారు.

**మలక్‌పేటలో ఇదీ పరిస్థితి**

2026 జూన్ నాటికి మలక్ పేటలో మొత్తం 3,30,191 మంది ఓటర్లు ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,31,354 ఓట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1,35,807 ఓట్లు నమోదైనప్పటికీ ఎన్నికల సంఘం ఇప్పుడు ఈ నియోజకవర్గానికి సంబంధించి ఏకంగా 1,47,799 పేర్లను తొలగింపు జాబితాలో చేర్చింది. అంటే సుమారు 44.76 శాతం మంది ఓటర్ల పేర్లు ఈ కేటగిరీలోకి చేరాయి.

యాకుత్?పురాలో గమనిస్తే : 3,74,948 మంది నమోదిత ఓటర్లు ఉన్న యాకుత్‌పురా నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,39,990 ఓట్లు, పార్లమెంట్ శాసన నియోజకవర్గ ఎన్నికల్లో 1,56,341 ఓట్లు పోలైనప్పటికీ 1,54,982 మంది ఓటర్ల పేర్లను తొలగింపు జాబితాలో చేర్చారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రతి పది మంది ఓటర్లలో నలుగురి కంటే ఎక్కువ మంది పేర్లు తొలగింపు జాబితాలో ఉండటం గమనార్హం.

ఓటింగ్ శాతంపై ప్రభావం చూపొచ్చు : గత ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య కంటే అధికంగా ఆయా నియోజకవర్గాల్లో



అందుబాటులో లేనివారు, వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు, మరణించిన లేదా ఆచూకీ లేని ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లయితే, ఇది గత ఎన్నికల్లో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోల్చితే ఓటింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సాధారణంగా తక్కువ ఓటింగ్ శాతం నమోదయ్యే హైదరాబాద్ నియోజకవర్గాల్లోనే సర్? ద్వారా ఇలా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగింపులు కనిపిస్తున్నాయి. 2023లో తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాల జాబితాలో మలక్‌పేట్, యాకుత్‌పురా కూడా ఉన్నాయి.

**పేర్లు తొలగిపోయినట్లు తేల్చడం సరికాదు**

తొలగింపు ముసాయిదా జాబితాను సిద్ధం చేసేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) గైర్హాజరైన, నివాసం మార్చుకున్న లేదా మరణించిన ఓటర్లకు సంబంధించిన వాదనలు, అభ్యంతరాలను సేకరించడానికి ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేస్తున్నారు. అదే సమయంలో అధికారిక నోటీసులను కూడా జారీ చేస్తున్నారు. తొలగింపు ముసాయిదా జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరినీ తుది ఓటర్ల జాబితా నుంచి శాశ్వతంగా తొలగిపోయినట్లు ఇప్పుడే తేల్చడం తొందరపాటు అవుతుందని రాజకీయ నాయకులు వాదిస్తున్నారు. అయితే మలక్‌పేట్, యాకుత్‌పురాలో గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే తొలగింపు జాబితాలోని పేర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్రంగా పరిశీలించాల్సిన విషయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

# వైసీపీ తెలంగాణ నేతగా కోమటిరెడ్డి?

వైసీపీ పార్టీ ఎన్ఆర్ఐ టీమ్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యక్ష ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని, అందుకే గత కొన్ని నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథానే తనకు ఆదర్శమని ఈ వేదికగా రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, విద్యా రంగానికి ఎంతో కీలకమైన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించలేని దయనీయమైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాజకీయాన్ని కేవలం వ్యాపారంగా మార్చుకుని, పైసలు సంపాదించడమే ధ్యేయంగా వచ్చిన వాళ్లు రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడలేరని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన అవినీతి, నేడు గ్రామీణ స్థాయి వరకు పాకిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బంధు లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఒక చేతితో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నటిస్తూనే, మరో చేతితో గల్లీ గల్లీలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచి ఆ డబ్బును ప్రజల నుంచి దారుణంగా గుంజుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు సంక్షేమం అందించడానికి బదులు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని మండిపడ్డారు. గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలనాత్మక నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం తెలంగాణ గడ్డపై వైఎస్ఆర్‌సీపీని తిరిగి బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో కచ్చితంగా విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తానని చెప్పారు. అంటే వైఎస్ఆర్‌సీపీని ఆయన తెలంగాణలో ప్రారంభించి దానికి నాయకత్వం వహించే



దిశగా ఆలోచిస్తున్నారని అనుకోవచ్చు. రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. ఆయన నిత్యం ఒక సొంత ఇమేజ్, అగ్రెసివ్ మార్క్ రాజకీయం కోరుకునే నాయకుడు. గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి, మళ్లీ అక్కడ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం వెనుక ఆయన ఆశించిన రాజకీయ ప్రాధాన్యతే ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ నిరంతరం ఆలస్యం కావడం, తనకు మంత్రి పదవి దక్కకపోవడం పట్ల ఆయన వర్గం తీవ్ర తీవ్ర అసంతృప్తితో ఉంది.

ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి నాయకత్వానికి పోటీగా లేదా తన ఉనికిని చాటుకునేందుకు వైఎస్సార్ భావజాలాన్ని ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకోవడం ఆయన వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. వైఎస్సార్ పేరు తెలంగాణలో ఇప్పటికీ కొంతమంది ఓటర్లలో సానుభూతిని నింపగలదని ఆయన భావిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో వైఎస్సార్‌పై ఉన్న అభిమానం అంతరించిపోలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను, పాత వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను ఒక తాటిపైకి తెచ్చి సొంత సైన్యాన్ని నిర్మించుకోవడానికి రాజగోపాల్ రెడ్డికి ఇది ఉపయోగపడవచ్చు. ఏ నిర్ణయమైనా ధైర్యంగా తీసుకునే ఫైటింగ్ నేచర్ రాజగోపాల్ రెడ్డి సొంతం. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడని ఆయన నైజం.. తెలంగాణలో ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కావాల్సిన ఆర్థిక, రాజకీయ సత్తాను ఇస్తుంది. ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ జెండాతో తెలంగాణలో రాజకీయం చేయడం ఎంత ప్రమాదకరమో షర్మిల అనుభవాలు నిరూపించాయి. ఏపీ కేంద్రీకృత పార్టీగా ముద్రపడిన వైఎస్సార్‌సీపీని తెలంగాణలో రీ-ఓపెన్ చేస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఆయనపై ఆంధ్రా పార్టీ అనే బలమైన తెలంగాణ సెంటిమెంట్ దాడిని విసిరే అవకాశం ఉంది. ప్రస్తుతానికి రాజగోపాల్ రెడ్డి వేస్తున్న అడుగులు కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగమని కొందరు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ కేబినెట్ పదవి ఇవ్వకపోతే, ఆయన కాంగ్రెస్‌ను వీడి సొంత దారి చూసుకోవడం ఖాయం. కానీ నేరుగా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుంటారా లేక వైఎస్సార్ పేరుతో కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుంటారా అనేది వేచి చూడాలి. తెలంగాణ రాజకీయాల్లో వాక్యూమ్ ఉందనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ని తెలంగాణలో పునరుద్ధరించడం అత్యంత సాహసోపేతమైన అడుగు. ఈ రిస్క్ చేసి ఆయన తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా లేదా మంత్రివర్గ విస్తరణ వరకు వేచి చూస్తారా అన్నదే రాబోయే రోజుల్లో తేలనుంది.

## హస్తంలో హై టెన్షన్!

-మొదటిపేజీ తరువాయి

చిక్కుముడులను, గందరగోళాన్ని, వారిలో ఉన్న మనస్పర్థలను తొలగించేందుకే అధిష్టానం ఆదేశాలు జారీ చేశారని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత వెల్లడించారు, ఎంతోకాలంగా మంత్రివర్గ విస్తరణ చేయాలని జాతీయ స్థాయి నాయకత్వం యోచిస్తుంది ఈ తరుణంలో కూడా కాంగ్రెస్ నేతలని పిలిచి ఉండవచ్చని మరో నాయకుడు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అందువల్లనే

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకేరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. కేంద్రమంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీల నేపథ్యంలో పాలనాపరమైన అంశాలతో పాటు పార్టీ వ్యవహారాలపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది.

**ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్.. ఒకేరోజు హస్తినబాట పట్టిన కీలక నేతలు**

తెలంగాణ కాంగ్రెస్ , కేరాఫ్ ఢిల్లీ. హస్తం పార్టీ కీలక నేతలంతా హస్తిన బాట పట్టడంతో.. అసలు ఏం జరుగుతోందన్న చర్చ జోరందుకుంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పలువురు కేంద్రమంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో కూడా రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశం ఉండడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక ఇదే సమయంలో మంత్రి కొండా సురేఖ కూడా ఢిల్లీ చేరుకున్నారు. సురేఖ వెళ్లిన ఫ్లైట్‌లోనే మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి కూడా ఢిల్లీ వెళ్లడం ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ కానున్నారు కొండా సురేఖ. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కూడా కోరారు సురేఖ. ముఖ్యమంత్రితోపాటు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఇప్పటికే ఢిల్లీలో ఉండగా మంత్రులు తుమ్మల, సీతక్క కూడా వరుసగా ఢిల్లీ చేరుకుంటున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బుధవారం ఢిల్లీ చేరుకుంటారు. కొందరు మంత్రులు పాలనాపరమైన అంశాలపై ఢిల్లీ బాటపట్టగా, మరికొందరు పార్టీ పనులపై హస్తిన చేరుకుంటున్నారు.

కీలక నేతల హస్తిన టూర్‌తో కేబినెట్ విస్తరణపై కూడా టాక్స్ వినిపిస్తున్నాయి. మంత్రిపదవిపై ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లడం, కేసీ వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉండటం ఆసక్తి రేపుతోంది. ఇక స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ తాజా రాజకీయ పరిస్థితులపై ఖర్గేతో చర్చించిన గడ్డం ప్రసాద్.. కేబినెట్‌లో చోటు కల్పించాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది..

## థౌజండ్‌వాలా

-మొదటిపేజీ తరువాయి

కానీ, ఈసారి థౌజండ్‌వాలా సెలబ్రేషన్స్‌ని కొత్తగా ప్లాన్ చేసినట్టున్నారు. ప్లాన్‌బీని అమల్లో పెట్టినట్టునట్టుంది రేవంత్ సర్కార్. ఏమిటా ప్లాన్‌బీ? ఎవరిని టార్గెట్ చెయ్యడానికి? ప్రోగ్రామ్ థీమ్ ఏంటంటే... అంబర్‌పేట్‌లో మూసీనదిపై 52 కోట్లతో కట్టిన బ్రిడ్జిని ప్రారంభించడం. తర్వాత స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్.. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్. కానీ, ఆ స్పీచ్‌కాపీలోనే ఒక చిన్న ఛేంజ్. చిన్నది కాదు పెద్దదే. మెయిన్ అపోజిషన్ పార్టీ ఊహించిందో లేదో గాని, రేవంత్‌రెడ్డి నుంచి బిగ్ అండ్ బిగ్గర్ ఛాలెంజ్. నీ పదేళ్ల విధ్వంసం.. నా వెయ్యి రోజుల సుపరిపాలన.. ఎవరెంత తోపో తేల్చుకుందామా అని. 2023 డిసెంబర్ 7న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సోనియా, రాహుల్, ప్రియాంక సమక్షంలో సీఎంగా రేవంత్‌రెడ్డి...

## ‘శుద్ధీకరణ’ పేరుతో సామాజిక అవమానం...





-మొదటిపేజీ తరువాయి

నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత ‘శుద్ధి’ చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. “మనిషిని మనిషిగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని,కానీ మనిషి నిలిచిన నేలను కూడా ‘శుద్ధి’ చేయాలనే మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఇటువంటి సామాజిక వివక్షకు భారతదేశం సాక్షిగా నిలవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో జరిగిన ‘విజయ్ శంఖనాద్’ బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ప్రసంగించారని ఉత్తమ్ గుర్తుచేశారు. ఖర్గే ఏ మతాన్నీ, ఏ వర్గాన్నీ ప్రస్తావించలేదని, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని తెలిపారు. అయితే సభ జరిగిన రెండు రోజుల తర్వాత అదే వేదికపై శ్రీరామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్‌కు చెందిన సభ్యులు ‘శుద్ధీకరణ’ హవనం నిర్వహించారని పేర్కొన్నారు. అవమానించినవారిని వదిలేసి... ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఘటన కంటే దానిపై అధికార వ్యవస్థ స్పందించిన తీరు మరింత(గ్ర్యాం)తికరమని ఉత్తమ్ మండిపడ్డారు. ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే అవమానకరమైన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా, అదే సంస్థకు చెందిన సభ్యుడి ఫిర్యాదు ఆధారంగా ఆగస్టు 30న ఉత్తరాఖండ్ పోలీసులు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. “అవమానకరమైన చర్యను చేసినవారు ప్రశ్నలకు అతీతులా? ఆ చర్యను ప్రశ్నించిన వ్యక్తే నిందితుడా? ఇదే న్యాయమైతే న్యాయం అనే పదానికే కొత్త నిర్వచనం రాయాల్సి వస్తుందని ఆయన ఘాటుగా స్పందించారు. తప్పును ప్రశ్నించిన గొంతుపై కేసు పెట్టి, తప్పుకు కారణమైన చర్యను పక్కనపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తినే తలకిందులు చేసే రాజకీయ ధోరణి” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్ మరో ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు. ఎఫ్ఐఆర్‌లతో సత్యాన్ని సంకెళ్లలో బంధించలేరు“ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగితే సత్యం మారదు. కేసులు పెరిగితే ప్రశ్నలు చనిపోవు. అధికార బలం పెరిగితే రాజ్యాంగం చిన్నదైపోదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు. సామాజిక వివక్షను ఎదిరించడం అంతకంటే నేరం కాదు” అని ఉత్తమ్ స్పష్టం చేశారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలతో పాటు సమాజంలోని ప్రతి అణగారిన వర్గానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా కులవివక్ష, ద్వేషం, బెదిరింపు రాజకీయాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి..
యువతను దేశ భవిష్యత్తుతో అనుసంధానించాలి
నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవాలు' : పీవీఎన్ మాధవ్




**విజయవాడ, సెప్టెంబరు 1** వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడ రామారావు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కార్యశాలను ఆయన ప్రారంభించారు. ప్రధాని మోదీ దేశం కోసం పూర్తి స్థాయి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని మాధవ్ పేర్కొన్నారు. సమస్యలు, సవాళ్లను ముందుగానే గుర్తించి పరిష్కారాలు చూపుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మోదీకి విశేష గుర్తింపు లభించిందన్నారు. త్రివర్ణ పతాకానికి అంతర్జాతీయంగా గౌరవం పెరగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలు భారత్ తీవ్రంగా దెబ్బతింటుందని భావించాయని, అయితే దేశీయంగా వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి ప్రజలకు అందించడంతో పాటు ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇబ్బంది లేకుండా ముందుచూపుతో క్రూడ్ ఆయిల్ నిల్వలను ఆరు నెలలకు సరిపడా సిద్ధం చేసినట్లు తెలిపారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ సాధించిన అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న ప్రజల ఆకాంక్ష మేరకు ఆయన ప్రధానిగా ఎదిగారని మాధవ్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

**పిల్లల ఆలోచనలకు పదును పెట్టాలి**

సేవా సంకల్ప ఉత్సవాల దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసి దేశ నిర్మాణంతో అనుసంధానం చేయాలని సూచించారు. 15 ఏళ్ల వయసు నుంచే పిల్లల్లో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పించాలన్నారు.పాఠశాలలకు వెళ్లే కార్యకర్తలు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని విద్యార్థులతో వినయంగా మమేకం కావాలని సూచించారు. గతంలో దేశం ఎలా ఉంది? ప్రస్తుతం ఎలాంటి మార్పులు వచ్చాయి? ఆ మార్పులకు కారణాలేమిటి? భవిష్యత్ భారత్ ఎలా ఉండాలి? అనే అంశాలపై విద్యార్థులతో చర్చలు నిర్వహించాలని చెప్పారు.డ్రాయింగ్, వ్యాసరచన, ప్రసంగం, నాయకత్వ నైపుణ్యాల వంటి పోటీలు నిర్వహించి పిల్లల్లో దేశభక్తి, సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్ భారతదేశాన్ని ఎలా చూడాలనుకుంటున్నారో వారి అభిప్రాయాలను సేకరించి వీడియోల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**మోదీ ఒక్కరి కల కాదు**

వికసిత్ భారత్ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరి బాధ్యత కాదని, దేశంలోని ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని ప్రజలకు వివరించాలని సత్యకుమార్ అన్నారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచి విశ్వగురువుగా ఎదగాలన్న లక్ష్యాన్ని యువతకు వివరించాలని సూచించారు.సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని, పార్టీ గుర్తింపుకు మించి సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా కార్యకర్తలు ప్రజల విశ్వాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో దేశభక్తి, దేశం పట్ల బాధ్యత, సమాజ సేవ భావనలను పెంపొందిస్తే వారు భవిష్యత్తులో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశంరాష్ట్ర కార్యశాలను రాష్ట్ర ఇన్‌ఛార్జి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. అతిథులను పార్టీ ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్ వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ సమారోప్ నిర్వహించారు.కార్యశాలకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మి ప్రసన్నలతో పీవీఎన్ మాధవ్ సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాల రూపకల్పన, సేవా సంకల్ప ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పలు సూచనలు చేశారు.


# ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ బడాయి కొట్టే రేవంత్ రెడ్డి..

నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటు.
మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**హైదరాబాద్ :** గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అధ్యాపకులు, నాన్టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక నరకం చూస్తున్నారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మీ తీరు వల్ల ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ఇప్పుడు దాదాపు 650కి పడిపోయింది. అంటే ఇప్పటికే సుమారు 310 కళాశాలలు తగ్గిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. దీని ప్రభావం అత్యధికంగా గ్రామీణ తెలంగాణపై పడుతుంది. చిన్న పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రధాన కేంద్రాలు. ఒక కళాశాల మూతపడటం అంటే ఆ ప్రాంతంలోని వందలాది, వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావడమే. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఉన్నత విద్యకు భరోసాగా నిలిచింది. ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను ఏళ్ల తరబడి పెండింగ్లో పెట్టడం వల్ల ఆ భారం కళాశాలలు, అధ్యాపకులు, సిబ్బంది, చివరికి విద్యార్థులపైనే పడుతోంది. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ ఱ పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందించారు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బందికి 5 నుంచి 10 నెలల వరకు జీతాలు పెండింగ్లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని అన్నారు, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి 2500 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉంటే, ఆ బకాయిలు చెల్లించి ఆ పథకాన్ని కొనసాగించినం. కేసీఆర్ .. పెద్ద నోట్ల రద్దు జరిగినా, కరోనా విపత్తు వచ్చినా ఫీజు రియింబర్స్ మెంట్ ఆపలేదు.తొమ్మిదిన్నరేండ్లలో గత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన బకాయిలతో సహా 19,500 కోట్లు ఫీజు రియింబర్స్ మెంట్ రూపంలో కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది. మేనిఫెస్టోలోనేమో. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబీ వర్గాల విద్యార్థులందరికి ఫీయి రియింబర్స్ మెంట్ తో పాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు" అన్నరు. ఇప్పటికి మూడు బడ్జెట్లు అయిపోయినయి. దాదాపు 10,000 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నయి. వైయస్ఆర్ గారు ప్రారంభించిన పథకం అంటూ గొప్పలు చెప్పుకునే మీకు ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేసే బాధ్యత లేదా? ఇది కేవలం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సమస్య కాదు.. విద్యార్థుల భవిష్యత్తు, అధ్యాపకులు, సిబ్బంది మనుగడకు సంబంధించిన సమస్య. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలి




**సిద్దిపేట :** వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, పలు అంశాలపైన సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవ నమహోత్సవం భాగంగా ప్లాంటేషన్ 83 శాతం పూర్తయిందని జిల్లా టార్గెట్ 17లక్షల 60 వేలకు గాను 14 లక్షల 63 వేలు ప్లాంటేషన్ చేశారని 100 శాతం ప్లాంటేషన్ పూర్తి చెయ్యాలని, పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.జలసిరి లో భాగంగా వర్షానికి పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టడం కోసం ప్రభుత్వం ఈ జలసిరి కార్యక్రమం చేపట్టిందని ఆయా మండలాల్లోని ఆశించిన స్థాయిలో పనుల్లో పురోగతి లేనందున అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఫాంపొండ్ కోసం రైతులను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలని, బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ కోసం గ్రామంలో ఎన్ని ఇలాంటి బోర్లు ఉన్నాయి లెక్కించి ఆయా రైతులతో మాట్లాడి బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ వలన బోర్లలో నీటి శాతం పెరుగుతుందని తెలపాలి. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, ముందుగా మండలంలోని ప్రభుత్వ భవనాలు అయిన గ్రామపంచాయతీ భవనాలు, స్కూల్స్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ భవనాలలు, ఎంపిక చేసుకుని ఎస్టిమేట్ వేసి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని ఏపిఓ లను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదటి విడతలో మంజూరు అయిన వాటిలో రూఫ్ లెవెల్ మరియు చిన్న చిన్న పనులు ఉన్న నిర్మాణాలను పూర్తి స్థాయిలో ఈ నెల 15 వరకు గృహ ప్రవేశాలు చేసేలా పని చెయ్యాలని, మార్కౌట్, గ్రౌండింగ్ కానీ వాటిని వెంటనే మొదలు పెట్టాలని, నిర్మాణంలో ఆలస్యం అవుతున్న వారితో స్థానిక ప్రజాప్రతిందులతో కలిసి చర్చించి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు.విబిజి రామ్ జీ లో చేపడుతున్న మండలాల వారిగా గ్రామాల్లో మంజూరు అయిన అంగన్వాడి, గ్రామపంచాయతీ భవనాలు, ఎస్ఎచ్ జీ భవనాలు పనులు మొదలు పెట్టని వాటిని గ్రామాల్లో గ్రామ సర్పంచ్ పాలకవర్గంతో సమావేశాలు నిర్వహించి భవనాలను మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉన్నవి భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేయూత పెన్షన్ల డెత్ మార్కింగ్ వెరిఫై ప్రక్రియ పూర్తి చేసి క్లోజ్ చెయ్యాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ మరియు ఇంచార్జ్ డిఆర్డిఓ రమేష్, డిపిఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పిడి భగవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చంద్రుపట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు


అన్న అంటే మేమున్నామంటున్న కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు



**ఖమ్మం,సెప్టెంబర్01(సూర్యరేఖ):**కల్లూరు చంద్రుపట్ల గ్రామానికి చెందిన బొడ్డు కిరణ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న నేపథ్యంలో చంద్రుపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన బొడ్డు కిరణ్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్పందించి తమ వంతు సహాయంగా రూ.23,500లను కిరణ్ భార్య,తల్లికి అందజేశారు.ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి అన్న అంటే మేమున్నామంటూ భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కుక్క వేలాద్రి,కాటమనేని వీరభద్రరావు,పరిగడుపు వెంకటేశ్వర్లు,ఇనపనూరి ముత్తయ్య,మోదుగు గోవింద్ తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో వల్లపునేని అప్పారావు రూ.3,500,కుక్క వేలాద్రి రూ.2,000,వైకుంఠపు బాబురావు రూ.2,000,కొమ్మినేని రమేష్ రూ.1,000,లింగానబోయిన పుల్లారావు రూ.1,000,దుగ్గిరాల సీతారాములు రూ.1,000,తిప్పారెడ్డి రామనరసింహారావు రూ.1,000,లింగనబోయిన నాగేశ్వరరావు రూ.1,000,మానల రవి రూ.1,000,పైళ్ల నాగేశ్వరరావు రూ.1,000,పైళ్ల శేఖర్ రూ.500,గంధం బసవయ్య రూ.1,000,కోమటి సాయి రూ.1,000,గద్దే భాస్కరరావు రూ.500,మద్దిబోయిన కృష్ణయ్య రూ.500,గంధం రామారావు రూ.1,000,తూము నరసింహారావు రూ.1,000,కొమ్మినేని శ్రీనివాసరావు రూ.1,000,కోలా సత్యం రూ.1,000,మాగంటి ప్రభాకర్‌రావు రూ.1,000,మోదుగు గోవింద్ రూ.1,000,పరిగడుపు వెంకటేశ్వర్లు రూ.1,000,ఇనపనూరి ముత్తయ్య రూ.1,000,నాగబత్తిని జయరాజు రూ.500లు అందించారు.ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కిరణ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.సహాయం అందించిన నాయకులు,కార్యకర్తలకు వారి కుటుంబ సభ్యులకు భగవంతుని కృపాకటాక్షాలు కలగాలని ఆకాంక్షించారు.

## ఓటర్లకు ముఖ్య గమనిక..

సెప్టెంబర్16న ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి..



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ**
రాజేంద్రనగర్ శాసనసభ నియోజక వర్గ పరిధిలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా కొందరు ఓటర్లకు ఎన్నికల నమోదు అధికారి నోటీసులు జారీ చేశారు.ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన అనంతరం తుది ఓటర్ల జాబితాలో పేరు కొనసాగిం చేందుకు,ఓటరు వివరాల ధ్రువీకరణ నిమిత్తం సంబంధిత వ్యక్తులు సెప్టెంబర్16న అసలు ధ్రువీకరణ పత్రాలతో అధికారుల ఎదుట హాజరు కావాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో సెప్టెంబర్16న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశించిన తేదీ,సమయంలో తప్పనిసరిగా హాజరై తమ వద్ద ఉన్న అసలు ధ్రువీకరణ పత్రాలను చూపించాలని సూచించారు.అదేవిధంగా పత్రాలపై స్వయంగా లేదా తండ్రి,తల్లి పేరుతో స్వీయ ధ్రువీకరించిన ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.ధ్రువీకరణ పత్రాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,పింఛనుదారుల గుర్తింపు కార్డు లేదా పింఛను చెల్లింపు ఉత్తర్వు,1987 జూలై 1వ తేదీకి ముందు ప్రభుత్వం,బ్యాంకు,తపాలా కార్యాలయం,ఎల్ఐసీ,ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా ధ్రువీకరణ పత్రం,సమర్థ అధికారి జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం,పాస్‌పోర్టు,గుర్తింపు పొందిన విద్యా బోర్డులు లేదా విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్,విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు,సంబంధిత రాష్ట్ర సమర్థ అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం,అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం,ఇతర వెనుకబడిన తరగతులు,అనుసూచిత కులాలు,అనుసూచిత తెగలకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రం,అందుబాటులో ఉన్న చోట జాతీయ పౌర పట్టిక,రాష్ట్ర లేదా స్థానిక అధికారులు రూపొందించిన కుటుంబ రిజిస్టర్,ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రాలను సమర్పించవచ్చని అధికారులు తెలిపారు.ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి వ్యక్తి పేరు కొనసాగేందుకు అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.నోటీసు అందుకున్న వారు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత తేదీలో సంబంధిత కార్యాలయానికి హాజరై అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.ఈ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సహాయం అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారి ఎన్.మమతను సంప్రదించాలని అధికారులు తెలిపారు.తప్పుడు సమాచారం అందించడం లేదా ఓటర్ల జాబితాలో తప్పుడు ప్రకటనలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.తప్పుడు ప్రకటనలకు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్217,ప్రజా ప్రాతినిధ్య చట్టం,1950లోని సెక్షన్31 ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ నూతన కమిటీ ఏర్పాటు..





## ఉప్పల్ శాఖ కన్వీనర్ ఆకుల రాకేష్ అధ్యక్షతన పూర్తిస్థాయి కమిటీ ప్రకటన..

**ఉప్పల్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి--ఉప్పల్ శాఖ నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఉప్పల్ శాఖ కన్వీనర్ ఆకుల రాకేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్తి స్థాయి నూతన కమిటీని ప్రకటించారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మల్కాజ్‌గిరి పార్లమెంట్ అధికార ప్రతినిధి మారినేని ఫణీందర్,ఉప్పల్ నియోజకవర్గ కో-కన్వీనర్ ఎల్లగోని ప్రకాశ్ గౌడ్,ఉప్పల్ శాఖ సీనియర్ నాయకులు రావుల బాలకృష్ణగౌడ్,బొంగు రమేష్ గౌడ్,ఉప్పోజు బల్వంత్ చారి,రెడ్డిగారి దేవేందర్ రెడ్డి సూచనలు, మార్గదర్శకత్వంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ శాఖ కో-కన్వీనర్లుగా బచ్చ శివకురుమ,ఎర్ర నర్సింగ్,వెంకట్ ముదిరాజ్, కోకా రవి,వరుణ్‌లను నియమించారు.డివిజన్ ఇన్‌చార్జ్‌గా నామ శ్రవణ్‌ను నియమించారు.అదేవిధంగా ఆర్‌టీఏ శాఖ ఇన్‌చార్జ్‌గా జెన్నీ వెంకటేష్,పోలీస్ శాఖ ఇన్‌చార్జ్‌గా నవీన్ గౌడ్, జీహెచ్‌ఎంసీ శాఖ ఇన్‌చార్జ్‌గా రావుల అఖిలేష్, న్యాయ సలహాదారుగా జస్వంత్ రెడ్డి,డివిజన్ కో-కోఆర్డినేటర్‌గా విజయ్ గౌడ్,హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్‌గా సతీష్ చారి,విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్‌గా అంబటి సందీప్,మీడియా ఇన్‌చార్జ్‌గా కొత్తపల్లి శివ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వినయ్,కార్యాలయ ఇన్‌చార్జ్‌గా మామిండ్ల యశ్వంత్‌లను నియమించారు.నూతన కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో హాజరై కమిటీ సభ్యులకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా గుండె పునీందర్, అడెపు రమేష్,మట్టె అభిరామ్ రెడ్డి,ఆల్వాల్ బాలు ముదిరాజ్,ఎర్ర వంశీ,కప్పనవీన్,వినోద్,బోడిగె విజయ్ గౌడ్,సప్పిడి వివేక్,ఈగ వినయ్,అరుణ్, అభిషేక్,నీలం దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలి..

## రాహుల్ గాంధీపై అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి..




**ఖమ్మం,సెప్టెంబర్01(సూర్యరేఖ)**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ కల్లూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాన్ని పూలదండ వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ...కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తూ రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.కేంద్ర ప్రభుత్వంపై,బీజేపీపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు.చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.అసెంబ్లీకి రాకుండా ఎమ్మెల్యే గౌరవ వేతనం తీసుకుంటున్న కెసిఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని,సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సైబర్ క్రైమ్ వారికి ప్రోత్సహిస్తున్నాడని,సైబర్ క్రైమ్ లో అతనికి వాటా ఉందని కాంగ్రెస్ మండల నాయకులు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు,కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్,కల్లూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సర్పంచులు, అంకిరెడ్డిసత్యనారాయణరెడ్డి,భాగం నెరజాచౌదరి,మండలయూత్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు,టౌన్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్,నల్లగట్ల పుల్లయ్య,ముకర విజయ్ రావు,కౌన్సిలర్ రాంబాబు,కుచల గురవయ్య,షేక్ మైభు,తదితరులు పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి..

## గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఘటనపై సింగరేణి మండల సర్పంచుల సంఘం డిమాండ్




**కారేపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఊకే శిరీష మృతి ఘటనపై సింగరేణి మండల సర్పంచుల సంఘం తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసింది.ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి,బాధ్యుడైన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి చట్టప్రకారం కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేసింది.సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ...బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని కోరారు.కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ భూమి కల్పించి వారి కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.మహిళలు,విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని సర్పంచుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు,గాదేపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్,ఉపాధ్యక్షుడు,రేగులగూడెం సర్పంచ్ ఈసం మూతి వీరస్వామి,పోలంపల్లి సర్పంచ్,దిశ కమిటీ సభ్యురాలు ధారావత్ హేమలత బాలాజీ, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్,గుట్టకింద గుంపు సర్పంచ్ ఉండం రాఘవులు,మోట్లగూడ సర్పంచ్ పొడుగు పెంటయ్య,గేట్ కారేపల్లి సర్పంచ్ పూసం ఎల్లయ్య,గిద్దవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.అలాగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ నాయక్,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కళ్యాణ్ నాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుగుట్టపై రామాలయ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ





**హబ్సిగూడ,సెప్టెంబర్01(సూర్యరేఖ)**హబ్సిగూడలోని వెలుగు గుట్ట ప్రాంతం లో రామాలయ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ తీసుకున్నారు.రామాలయ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన గేటు,ఇతర నిర్మాణాలను ఐలా అధికారులు తొలగించడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా వెలుగుగుట్ట ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు .అనంతరం ఐలా అధికారులను కలిసి రామాలయ నిర్మాణాన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.ఆలయ నిర్మాణం స్థానిక ప్రజల విశ్వాసం,ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున ప్రజల మనోభావాలను గౌరవించి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని అధికారులను కోరారు.ఎమ్మెల్యే విజ్ఞప్తికి ఐలా అధికారులు సానుకూలంగా స్పందించి,రామాలయ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, కాలేరు జై నవీన్,జేసీబీ రాజు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రాతిపదికన మీ-సేవ కేంద్రాల సంఖ్య పెంచాలి..

## మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు



**మేడ్చల్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ తో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ మీ-సేవ కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజ్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంగళవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఆయా ప్రాంతాల్లో జనాభా పెరుగుతున్నప్పటికీ అందుబాటులో ఉన్న మీ-సేవ కేంద్రాల సంఖ్య సరిపోకపోవడంతో ప్రజలు ప్రభుత్వ సేవలను పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు,ధ్రువపత్రాలు,ఆదాయ,కుల, నివాస ధ్రువపత్రాలు,వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తుల కోసం ప్రజలు మీ-సేవ కేంద్రాలపై ఆధారపడుతున్నారని తెలిపారు.ఒకే కేంద్రంపై అధిక భారం పడటంతో ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. అలాగే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 297,298,299 డివిజన్లలో పెరుగుతున్న జనాభా,ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా ప్రభుత్వ మీ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.అదే విధంగా ఎల్లంపేట మున్సిపాలిటీలో కూడా జనాభా ప్రాతిపదికన మీ-సేవ కేంద్రాల సంఖ్యను పెంచి ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా,వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సమస్యను సానుకూలంగా పరిశీలించి,సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చినట్లు ఉమానాగరాజ్ ముదిరాజ్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా మీ-సేవ కేంద్రాల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## మెగా యూత్ ఫోర్స్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జనసేన అధినేత జన్మదిన వేడుకలు..



**కామారెడ్డి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాలలో జనసేన అధినేత,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మెగా యూత్ ఫోర్స్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని ధర్మశాల శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ,ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమం మరియు మెగా యూత్ ఫోర్స్ కామారెడ్డి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మెగా యూత్ ఫోర్స్ కామారెడ్డి నాయకులు జాజారి దినేష్ కుమార్ మాట్లాడుతూ...జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి మా అభిమాన నటుడు,నాయకుడు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడూ జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాజారీ దినేష్ కుమార్,పళ్లెం అరవింద్,రమేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికల్లో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి..

ఎల్లమ్మబండ హిందు,ముస్లిం,క్రిస్టియన్ల స్మశానవాటిక సుందరికరణ పనులను పరిశీలించిన

మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్01 (సూర్యరేఖ)** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ హిందు ,ముస్లిం మరియు క్రిస్టియన్ల స్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శ్మశాన వాటికలో నిర్మిస్తున్న ప్రహరి గోడ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్మశానవాటికకు కావలిసిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ మున్నా,ఖాజా ,నవాజ్,సమ్మద్,కైసర్,సుల్తాన్,ఖాజా, ఖలీమ్,ఇంతియాజ్,గౌస్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## 15వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ..



**బెల్లంపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తీ 15వ వార్డులో కౌన్సిలర్ వసంత ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ దావాస్వాతి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు రుణ సదుపాయాలు,ఉపాధి అవకాశాలు తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీ మహిళల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఆత్మీయతకు, గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,వార్డు మహిళలు,స్థానికులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఏర్పాట్లపై విద్యుత్ అధికారులతో ఆకారపు అరుణ్ పటేల్ బస్తీబాట..





**వెంకట్ రెడ్డినగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భక్తులకు,గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ కోరారు.ఈ మేరకు వెంకట్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖ ఏఈ,ఇతర అధికారులతో కలిసి ఆయన బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు.పలు కాలనీల పెద్దలు,యువకుల అభ్యర్థన మేరకు శ్రీనివాసపురం, మధురనగర్,రామ్ శంకర్ నగర్,కామాక్షిపురం,రామ్ రెడ్డినగర్,వెంకట్ రెడ్డినగర్ కాలనీల్లో అరుణ్ పటేల్ పర్యటించారు.గణేష్ మండపాల వద్ద విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.ప్రమాదకరంగా ఉన్న పాత మెయిన్ విద్యుత్ వైర్లను గుర్తించి,వాటి స్థానంలో తక్షణమే నూతన కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఉత్సవాల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈ మేఘనాథ్,లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,లైన్మెన్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ వెంకట్ రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి,మధురనగర్ కాలనీ అధ్యక్షుడు మానకొండ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జగదీష్,బాలయ్య,రామ్ రెడ్డి, సత్యనారాయణ,వెంకన్న,మల్లయ్య,అరుణ్,సాయి తదితరులతో పాటు ఆయా కాలనీల నాయకులు, కార్యకర్తలు,వర్కింగ్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు సమన్వయంతో కృషి..



భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్గా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్

**మేడ్చల్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్గా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,ను నియమించారు.మంగళవారం జరిగిన కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ నూనెముంతల రవీందర్ గౌడ్ ఈ నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ...మేడ్చల్ ఉమ్మడి మండల పరిధిలోని మేడ్చల్,పూడూర్-కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి జీహెచ్ఎంసీ డివిజన్లతో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సమన్వయం చేస్తూ శ్రీనివాస్ గౌడ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారని తెలిపారు.మేడ్చల్ గణేష్ ఉత్సవ సమితి,మేడ్చల్ నిమజ్జన సమితి ఆధ్వర్యంలో గత ఎనిమిదేళ్లుగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన..



సెప్టెంబర్14న గణేష్ పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టేందుకు అధికారులు,గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మేడ్చల్ పెద్ద చెరువు, సుతారుగూడ చెరువులను సందర్శించి పరిశీలించారు.నిమజ్జన ఏర్పాట్లు,భద్రత,ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం,విద్యుత్ తదితర అంశాలపై అధికారులతో సమితి ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. ..మేడ్చల్ ఉమ్మడి మండల పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ఘనంగా నిర్వహించేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు.నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశు,మేడ్చల్ ఏసీపీ శంకర్రెడ్డి,సీఐ అంజిరెడ్డి, ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్,డీఈ,ఏఈలతో పాటు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ రవీందర్ గౌడ్,మండల కో-కన్వీనర్ చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్,నర్సింగ్, నర్సింహ,తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 3వ తేదీన ఎన్ఆర్ఐ కోటాలో మిగిలిన యూజీ సీట్లకి వాక్ ఇన్ కౌన్సిలింగ్..

గతంలో దరఖాస్తు చేసుకోకపోయినా హాజరు కావొచ్చు..

అగ్రి వర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** 2026-27విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో గల కళాశాలలలో వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటాలో మిగిలిన సీట్లలో ప్రవేశాలకి సెప్టెంబర్ 3వ తేదీ(గురువారం)న వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు.రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ సెంటర్ లో ఉదయం పది గంటలకు ధృవ పత్రాల పరిశీలన,కౌన్సిలింగ్ జరగనుందని అల్దాస్ జానయ్య వివరించారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకొని వారు సైతం కౌన్సిలింగ్ కి హాజరు కావొచ్చని ఆయన స్పష్టం చేసారు.అభ్యర్థులు వారి తల్లితండ్రులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ .ఱఅని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకొని అర్హత కల అభ్యర్థులు అవసరం అయిన పత్రాలు, ఫీజులతో కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సిందిగా అల్దాస్ జానయ్య సూచించారు.

# ముస్లింలకు ఆర్థిక భరోసా..





## ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన చెక్కుల పంపిణీ..

**ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఎమ్మెల్సీ,చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.అనంతరం తుర్కయాంజల్‌కు చెందిన లబ్ధిదారులకు జనరేటర్ సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రెండు పథకాలను ముస్లిం మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పథకాలు మైనార్టీల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాయని,పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని వెల్లడించారు. వితంతువులు, విడాకులు పొందిన వారు,అనాథలు,అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టి స్వయం ఉపాధి పొందేలా ఇందిరమ్మ యోజన తోడ్పడుతుందన్నారు.చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి రూ.50వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు.ముఖ్యంగా మహిళలు, మైనార్టీల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి,ఎమ్మెల్యే గాంధీ,కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్,మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్ ఒబేదుల్లా,కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపతిరెడ్డితో పాటు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు

## రామంతపూర్ ముస్లిం మైనారిటీ వితంతు మహిళలకు రూ.50వేల ఆర్థిక సహాయం..

**మంత్రి శ్రీధర్ బాబుతో పాటు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహమ్మద్ రఫీక్**





**రామంతాపూర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**వితంతు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా"రేవంతన్నా కా సహారా" కార్యక్రమం నిర్వహించారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రఫీక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో రామంతపూర్ డివిజన్‌కు చెందిన ముస్లిం మైనార్టీ వితంతు మహిళలకు ఒక్కొక్కరికి రూ.50 వేల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను మహమ్మద్ రఫీక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రామంతపూర్ డివిజన్ చెందిన36 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు ఆర్థిక సహాయం మంజూరు కాగా మొదటి విడతగా ఆరుగురికి చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.అవసరాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం,ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సంక్షేమ పథకాలను మాటల్లో కాకుండా చేతల్లో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి మహమ్మద్ రఫీక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు సర్ఫ్ రాజ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాపుత్ర భాస్కర్,కేబుల్ అశోక్,పోయాకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.డి.షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్లతో ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం..

**క్రమశిక్షణ,సమర్థవంతమైన సేవలతో సంస్థకు మరింత సేవ చేయాలి..**

**జీఎం రాధాకృష్ణ**



**మందమర్రి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** సింగరేణి సంస్థలో ఉద్యోగుల ప్రతిభ, అనుభవానికి గుర్తింపుగా క్యాడర్ స్కీమ్ కింద లభించిన ప్రమోషన్లు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయం లో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ప్రమోషన్ ఉత్తర్వులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... ప్రమోషన్లు ఉద్యోగుల బాధ్యతలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.కొత్త హోదాలకు అనుగుణంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉద్యోగ ధర్మాన్ని నిబద్ధతతో పాటిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నతస్థాయి పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు.క్యాడర్ స్కీమ్ కింద జూనియర్ అకౌంటెంట్స్(టిడఎస్ 'బి'నుంచి 'ఎ'గ్రూప్)గా పోతు రమ్యసుధా,ఆకునూరి సంపత్,అసిస్టెంట్ చైర్మన్ (టిడఎస్'ఎఫ్ నుంచి'ఈ'గ్రూప్)గా ఎస్.కె .తాజుద్దీన్, సీహెచ్.వెంకట కృష్ణంరాజు,ఆఫీస్ అటెండెంట్ (టిడఎస్ 'హెచ్'నుంచి 'జి'గ్రూప్)గా సిరికొండ సీతమ్మ,ఆరుట్ల రమేష్ ప్రమోషన్ ఉత్తర్వులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్,ఏజీఎం(ఎఫ్అండ్ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్,డీజీఎం (సర్వే)బుఖ్య దేశాయ్,సీనియర్ పీఓ సురేందర్,ఆఫీస్ సూపరింటెండెంట్ (పర్సనల్) రాయలింగు,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ధాతల సహాయంతో పాఠశాలకు విద్యార్థులకు ప్లేట్స్, గ్లాసులు,కుర్చీలు అందజేత..



**ఖమ్మం,సెప్టెంబర్01 (సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో సుమారు 50సంవత్సరాల చరిత్ర కలిగి ఎందరో విద్యార్థులకు విద్యానందించి ఉజ్వల భవిష్యతుకు పునాది వేసిన మన ఊరి బడి ఋణ్ణం తీర్చుటకు, ప్రతి ఒక్క పౌరుడు ముందుకు రావాలని గ్రామ సర్పంచ్ రాచాబంటి కృష్ణా,మాజీ జడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్ బాబు గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.దాతలు జగదభి సీతారామరాజు, జగదభి పూర్ణచందర్ రాజు సహకారంతో రూ,10వేలు వెచ్చించి సుమారు 85మంది విద్యార్థులకు ప్లేట్స్ గ్లాసులు పంపిణి చెయ్యడం జరిగింది.అదేవిదంగా రెడ్డిచర్ల వెంకమ్మరాజు సహకారంతో సుమారు రూ.10వేలు వెచ్చించి 10 కుర్చీలను పాఠశాలకు అందజేశారు.దాతలకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు భూక్య సోమ్లా నాయక్,ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామరాజు, ముత్తారావు,మాజీ సర్పంచ్ వీరయ్య,గర్నెపూడి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ సమస్యల పరిష్కారానికి రివ్యూ సమావేశం..



**నిజాంపేట,సెప్టెంబర్01(సూర్యరేఖ)**ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు, దళితుల భూసమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మెదక్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఎమ్మార్పీఎస్ (టిఎస్)మెదక్ జిల్లా అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ బుధవారం మధ్యాహ్నం12 గంటలకు మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులపై రివ్యూ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా దళితుల భూసమస్యలపై కూడా చర్చించి,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.కావున మెదక్ జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ ప్రజలు, ఉపకులాల ప్రతినిధులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లేందుకు సకాలంలో కలెక్టరేట్‌కు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గరుగుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

## మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అడవి పందులు..



**నిజాంపేట,సెప్టెంబర్01(సూర్యరేఖ)** అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట పూర్తిగా ధ్వంసం కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.నిజాంపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్మాట సత్యనారాయణ తన వ్యవసాయ పొలంలో ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేశారు.పంట చేతికొచ్చే సమయంలో అడవి పందులు పొలంలోకి చొరబడి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ,ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే అడవి జంతువుల కారణంగా నష్టం వాటిల్లుతోందని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.అడవి పందుల బెడదను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని,పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## సీపీఎస్ రద్దు చేసి..ఓపీఎస్ పునరుద్ధరించాలి..



**నిజాంపేట,సెప్టెంబర్01(సూర్యరేఖ)**కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, ఉద్యోగులు,ఉపాధ్యాయులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల తరపున టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిజాంపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉద్యోగ,ఉపాధ్యాయులు మాట్లాడుతూ. ..సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై స్పష్టత లేకపోవడంతో పాటు,మార్కెట్‌పై ఆధారపడిన పెన్షన్ విధానం కారణంగా ఉద్యోగులు,వారి కుటుంబాల భవిష్యత్‌పై అనిశ్చితి నెలకొంటోందన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీపీఎస్‌ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.తమ న్యాయమైన డిమాండ్‌ను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్, మండల అధ్యక్షుడు పర్షరాములు,ప్రధాన కార్యదర్శి దశరథం,జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి స్వప్న, మండల ఉపాధ్యక్షుడు రాజు,మండల కోశాధికారి జెల్ల శ్రీకాంత్,మండల బాధ్యులు రాజేందర్,శ్రీనివాస్, స్వాతి,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# ఉత్పత్తి నుంచి సంక్షేమం వరకు.. అభివృద్ధి బాటలో మందమర్రి ఏరియా

**బొగ్గు ఉత్పత్తిలో జోరు..రవాణాలో దూకుడు.. లక్ష్యాలు దాటేసి..విస్తరణకు పరుగులు**

**నిర్వాసితులకు పునరావాసం..కార్మికులకు సంక్షేమం**

**జీఎం ఎన్.రాధాకృష్ణ**




**మందమర్రి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** సింగరేణి మందమర్రి ఏరియాలో ఉత్పత్తితో పాటు భవిష్యత్ విస్తరణ,నిర్వాసితుల పునరావాసం, కార్మిక సంక్షేమం,విద్యార్థుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ఏరియాను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు.మంగళవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏరియా అభివృద్ధి,వివిధ ప్రాజెక్టుల పురోగతి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

**ఆర్కేపీ విస్తరణకు క్లియరెన్స్ వేగవంతం..**

మందమర్రి ఏరియా భవిష్యత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే కీలక ప్రాజెక్టుల్లో ఒకటైన ఆర్కేపీ ఓసీపీ విస్తరణకు సంబంధించిన క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతమైందని జీఎం రాధాకృష్ణ తెలిపారు.ఫారెస్ట్ క్లియరెన్స్‌కు సంబంధించిన ఆమోదాలు సీఎఫ్ కార్యాలయం నుంచి పీసీసీఎఫ్ కార్యాలయానికి చేరాయని,త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ప్రతిపాదనలు ఢిల్లీకి పంపనున్నట్లు వెల్లడించారు.ఆర్కేపీ ఓసీపీ విస్తరణలో భాగంగా పెద్దనపల్లి వద్ద సుమారు150ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.బెల్లంపల్లి సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో భూసేకరణకు సంబంధించిన చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

**దుబ్బగూడం నిర్వాసితులకు కొత్త జీవితం..**

కేకే ఓసీపీ ముంపు ప్రాంతమైన దుబ్బగూడం నిర్వాసితుల కోసం సింగరేణి నిర్మిస్తున్న ఆర్అండ్ఆర్ కాలనీ పనులు వేగంగా సాగుతున్నాయని జీఎం తెలిపారు.నిర్వాసితులకు రెండు గుంటల చొప్పున స్థలాలు కేటాయించామని, ఇప్పటికే కొత్త కాలనీలో తొలి గృహప్రవేశం కూడా జరిగిందన్నారు.కొత్త రహదారి అందుబాటులోకి వస్తే బొగ్గు, ఇసుక రవాణా దూరం తగ్గడంతో పాటు సంస్థ రవాణా వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

**లక్ష్యాలకు మించి ఉత్పత్తి..రవాణా**

మందమర్రి ఏరియా ఉత్పత్తి,రవాణాలోనూ మంచి ప్రగతి సాధిస్తోందని జీఎం తెలిపారు.ఆగస్టులో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని105శాతం సాధించగా,ఓబీ తొలగింపులో 102శాతం ప్రగతి నమోదైందన్నారు.బొగ్గు రవాణాలో ఆగస్టు నెలకు 1.74 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.83 లక్షల టన్నులు రవాణా చేసి105శాతం సాధించినట్లు తెలిపారు.ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 9.97లక్షల టన్నుల లక్ష్యానికి గాను 10.52లక్షల టన్నులు రవాణా చేసి 106శాతం క్యాములేటివ్ ప్రగతి సాధించినట్లు వెల్లడించారు.కేకే-5 అండర్‌గ్రౌండ్ మైన్, కేకే ఓసీపీ తదితర గనుల్లో అధికారులు, సూపర్‌వైజర్లు,కార్మికుల సమిష్టి కృషితో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని జీఎం పేర్కొన్నారు.

**భూగర్భ గనులపై ప్రత్యేక దృష్టి..**

భూగర్భ గనుల్లో ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని రాధాకృష్ణ తెలిపారు.ముఖ్యంగా హాజరు శాతం తక్కువగా ఉండటం ఉత్పత్తిపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.పని గంటలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్పత్తి పెంపునకు కార్మికులు సహకరించాలని కోరారు.

**సీఎంపీఎఫ్, పెన్షన్ సమస్యలకు పరిష్కారం..**

సింగరేణి ఉద్యోగులు,కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్, పెన్షన్ సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జీఎం తెలిపారు.పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా ‘ప్రయాస్’విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ‘జీరో పెండింగ్’లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థుల సంక్షేమానికి రూ.7.5 కోట్ల సింగరేణి చేయూత..**

కార్మిక సంక్షేమంతో పాటు సమాజంలోని విద్యార్థుల అభివృద్ధికి కూడా సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తోందని రాధాకృష్ణ తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో హైటెక్ కిచెన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.హెచ్‌కేఎం ఛారిటబుల్ ట్రస్ట్,హారే రామ హారే కృష్ణ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు.

**కార్మిక ప్రయోజనాల పరిష్కారంలో వేగం..**

కార్మికులు, ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీఎం తెలిపారు.2018నుంచి ఇప్పటివరకు 2,171మెడికల్ ఇన్వాలిడేషన్ కేసులు పరిష్కరించగా,1,908 మందికి కారుణ్య నియామకాలు,112 మందికి లంసమ్ అమౌంట్, 16 మందికి ఎంఎంసీ మంజూరు చేసినట్లు వివరించారు. 2026--27ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 139 క్వార్టర్లు కేటాయించగా,ఆగస్టులో 21క్వార్టర్లు మంజూరు చేసినట్లు తెలిపారు.ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 65సీఎంపీఎఫ్,57గ్రాట్యుటీ,68 పెన్షన్, 424 హెచ్‌బీఏ రీఫండ్ క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు వెల్లడించారు.ప్రమోషన్లలో భాగంగా జనవరి 1,2026నుంచి ఇప్పటివరకు 106 ఎస్ఎల్‌పీ/ఎస్ఎల్ఐ ఆఫీస్ ఆర్డర్లు జారీ చేశామని, క్యాడర్ ఆధారిత ప్రమోషన్లలో మార్చి 1న 30 మందికి,సెప్టెంబర్ 1న 36 మందికి ప్రమోషన్ ఆర్డర్లు అందించినట్లు తెలిపారు.

**సమష్టి కృషితో మరింత ముందుకు..**

మందమర్రి ఏరియాను ఉత్పత్తి, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జీఎం రాధాకృష్ణ పిలుపునిచ్చారు. క్వార్టర్ల మరమ్మతులు, సోమగూడెం డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, గనుల్లో క్యాంటీన్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్‌కుమార్, సీనియర్ పర్సనల్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సమరభేరి..వాటర్ వర్క్స్ జీఎంను నిలదీసిన బీజేపీ నాయకులు గడ్డం సాయికిరణ్

**వెంకట్‌రెడ్డినగర్‌లో తాగునీరు,డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్**




**రామంతపూర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వెంకట్‌రెడ్డి నగర్,రామ్‌రెడ్డినగర్,వాసవినగర్ కాలనీలలో తీవ్రంగా ఉన్న తాగునీరు,డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు,కాలనీ వాసులు,వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ (జీఎం)సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.బీజేపీ నాయకులు గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు,డ్రైనేజీ సమస్యలను గడ్డం సాయికిరణ్ జీఎం సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. నల్లాలు తిప్పినప్పుడు మొదటి 15నిమిషాల పాటు మురుగునీరు వస్తోందని,దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కలుషిత నీటి సరఫరాపై ప్రజల్లో ఆరోగ్య భయాలు నెలకొన్నాయని పేర్కొన్నారు.డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోరుతూ..వెంకట్‌రెడ్డినగర్‌లో తీవ్రంగా దెబ్బతిన్న సుమారు 1,000మీటర్ల డ్రైనేజీ పైప్‌లైన్‌ను పునర్నిర్మించాలని,రామ్‌రెడ్డినగర్‌లో 400మీటర్ల డ్రైనేజీ లైన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వాసవి నగర్‌లోని 3,4,5వ స్ట్రీట్లలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో పాటు తాగునీటి సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు.అలాగే కాలనీలలో తగిన నీటి ప్రెజర్ లేకపోవడంతో పరిశుభ్రమైన తాగునీరు అందడం లేదని,దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని గడ్డం సాయికిరణ్ తెలిపారు. ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

**తక్షణ చర్యలకు జీఎం హామీ..**

సమస్యల తీవ్రతను తెలుసుకున్న జీఎం సంతోష్ వెంటనే సంబంధిత డీజీఎం,ఏఈలతో ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.1,000 మీటర్లు,400 మీటర్ల డ్రైనేజీ లైన్ సమస్యలతో పాటు కలుషిత నీటి సరఫరా సమస్యను కూడా త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు,కాలనీ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్,అశోక్, నాగరాజు,కుక్కల సత్యనారాయణ,ఆవుల సుధాకర్,గడ్డం వెంకట్ సాయి తదితరులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో సర్పంచ్‌ల చైతన్య సదస్సు..



**చెన్నూర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన సర్పంచ్‌ల చైతన్య సదస్సును మంగళవారం నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపూల సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు,వాటి పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో సర్పంచ్‌ల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరి సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా,ప్రధాన కార్యదర్శిగా పులి రాజశేఖర్ను ఎంపిక చేశారు.ఉపాధ్యక్షులుగా దాసరి మణిదీపక్, వంగ రాములుగౌడ్,రాంగిరి రామన్న,కొమ్ము భీరయ్య, కుదిరే వెంకన్నలను ఎన్నుకున్నారు.కోశాధికారిగా మంత్రి గోపికృష్ణను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చా కార్యనిర్వాహక సభ్యుడుగా వెంకటేష్ యాదవ్..



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్01 (సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ అనుబంధ ఓబీసీ గోల్కొండ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడుగా వెంకటేష్ యాదవ్ నియమితులైనారు.ఈ సందర్భంగా జియాగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ. ..నాయకుల మధ్య విభేదాలను పక్కన పెట్టి సమిష్టిగా ఐక్యతతో ముందుకు సాగడం ద్వారా పార్టీని బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.ప్రభుత్వం అందించే అభివృద్ధి,సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా చేయడం నా కర్తవ్యమన్నారు.ప్రజల్లో నిరంతరం ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం వాటిని పరిష్కరించదానికి కృషి చేస్తానని, అలాంటప్పుడే ప్రజలు పార్టీకి అండగా ఉంటారని తెలిపారు.పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు.పార్టీలోని సీనియర్ల అనుభవాన్ని,జూనియర్ల ఉత్సాహాన్ని సమన్వయం చేసుకొని ముందుకు సాగుతానన్నారు.పార్టీ వ్యతిరేక ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టడం జరుగుతోందని అన్నారు.ప్రజాస్వామ్య రక్షణతోపాటు ప్రజల హకులను కాపాడే దిశగా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలన్నారు.బీజేపీ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని వెంకటేష్ యాదవ్ కోరారు.

## రాక్‌బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌కు ఎంపీ రఘునందన్‌రావు అభినందనలు..




**మేడ్చల్,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**ఇటీవల జరిగిన దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించారు. మంగళవారం గోపాల్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎంపీ రఘునందన్‌రావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ గోపాల్ యాదవ్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి,జట్టు విజయానికి భాగస్వామి కావడం గర్వకారణమన్నారు .తెలంగాణ యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీజేపీ సీనియర్ నాయకులు రుక్మెంధర్,గ్రామస్తులు నీరుడి మహేష్,దేవక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది..

దుర్గం చిన్నయ్య





**బెల్లంపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు.బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ...గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు,420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 1000రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు'కాంగ్రెస్ 420మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట'కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గంలో వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.సెప్టెంబర్ 2న ఉదయం10 గంటలకు బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ధర్నా, బాకీ కార్డుల పంపిణీ,420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు.సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసి బిడ్డ శిరీషను అతి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి,బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం అందించాలి..

శిరీష మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరపలి..

ఉసిరికాయలపల్లి సీనియర్ నాయకురాలు

బోడ జ్యోతిరవి



**కారేపల్లి,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**భద్రాద్రి కొత్త గూడెం జిల్లా,ములకలపల్లి మండలానికి చెందిన ఆదివాసి యువతి ఊకే శిరీషపై జరిగిన అత్యాచారం,అనంతరం జరిగిన హత్య రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బోడ జ్యోతి రవి ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసి సమాజానికి చెందిన ఒక అమాయక యువతి ప్రాణాలు కోల్పోయిన తర్వాత కూడా,ఘటనకు సంబం ధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.అందువల్ల ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో, జ్యుడిషియల్ విచారణ జరిపి అసలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.దళిత,గిరిజన మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు,హత్యలు,వేధింపులు పెరుగుతుండటం అత్యంత ఆందోళన కరమని పేర్కొన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉన్నప్పటికీ, దళిత, గిరిజన మహిళల ప్రాణాలు, గౌరవం,భద్రతకు పూర్తి స్థాయిలో రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత,గిరిజన బాధితులపై దాడులు జరిగినప్పుడు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ,తరువాత వాటిని బలహీనపరిచే ప్రయత్నాలు,రాజకీయ ఒత్తిళ్లు, రాజీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు .నేరస్థులను కాపాడే ఏ రాజకీయ నాయకుడైనా,ప్రభావశీలుడైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు.ఊకే శిరీషపై దారుణానికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి,వేగవంతమైన విచారణ జరిపి చట్టప్రకారం అత్యంత కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా,కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం,ఐదు ఎకరాల సాగుభూమి,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

## హైదరాబాద్,లో గణేష్ నిమజ్జనంపై కొత్త వివాదం..

గణేష్ నిమజ్జనంపై హైడ్రా వర్సెస్ గణేష్ ఉత్సవ సమితి..



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**హైదరాబాద్ లో గణేష్ నిమజ్జనంపై కొత్త వివాదం మొదలైనది.గణేష్ నిమజ్జనంపై హైడ్రా వర్సెస్ గణేష్ ఉత్సవ సమితి కొట్లాట..!అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనానికి నో అంటున్న హైడ్రా..!ఎప్పటిలాగే అన్ని ట్యాంకుబండ్ హుసేన్ సాగర్ చెరువుల్లో నిమజ్జనం చేస్తాం అంటున్న గణేష్ ఉత్సవ సమితి..నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేష్ ఉత్సవ సమితి.గణేష్ నిమర్జన విషయంలో ఎవరి పట్టు గెలుస్తుందో చూడాలి..

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సహా బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు..





**నాచారం,సెప్టెంబర్01(సూర్యరేఖ)** నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి నివాసం, జిల్లా బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారంటూ బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ దాడిని ఖండిస్తూ వర్షిత్‌రెడ్డిని పరామర్శించేందుకు నల్గొండకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును పోలీసులు ఆయన నివాసం వద్ద ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రాష్ట్ర అధ్యక్షుడికి మద్దతుగా ఆయన నివాసం వద్దకు చేరుకున్న పలువురు బీజేపీ నాయకులను కూడా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి లాలాగూడతో పాటు ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,రామకృష్ణ,వాసంశెట్టి శ్రీనివాస్, రామ్ వర్మ,సురేష్ గౌడ్,గడ్డం సాయి,సుబ్బారావు తదితర బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులను ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పార్టీ నాయకుడిని పరామర్శించేందుకు వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, సెప్టెంబర్01 (సూర్యరేఖ)** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు.బెల్లంపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించిన కలెక్టర్,అక్కడ జరుగుతున్న భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని అధికారులకు సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు,పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్,సబ్ కలెక్టర్ మనోజ్,ఎమ్మార్వో కృష్ణ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యోగ విరమణ తర్వాత భరోసా కల్పించాలి..

ఓపీఎస్ కోసం ఉద్యోగుల గళం..భోజన విరామంలో నిరసన



**మందమర్రి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**ఏళ్ల తరబడి ప్రభుత్వ సేవలో పనిచేసి పదవీ విరమణ పొందిన తర్వాత ఉద్యోగులు ప్రశాంతమైన, ఆర్థిక భద్రతతో కూడిన జీవితాన్ని గడపాలంటే పాత పెన్షన్ విధానమే సరైన మార్గమని ప్రభుత్వ ఉద్యోగులు పేర్కొన్నారు.కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి,పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ప్రజలకు,ప్రభుత్వానికి సేవలందిస్తున్నామని,రిటైర్మెంట్ అనంతరం వారికి పెన్షన్ రూపంలో స్థిరమైన ఆదాయం ఉండటం ఎంతో అవసరమని ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.సీపీఎస్ విధానాన్ని కొనసాగించడం వల్ల భవిష్యత్ ఆర్థిక భద్రతపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంటోందని పేర్కొన్నారు.ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.దీర్ఘకాలం ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం అందేలా పెన్షన్ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి ఓపీఎస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ తహసీల్దార్ ఆనంద్ కుమార్,నాయబ్ తహసీల్దార్ సంతోష్ కుమార్,గిర్దావర్ (రెవెన్యూ ఇన్స్పెక్టర్) అంజన్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ గుండెపోటుతో మృతి..



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**రాజేంద్రనగర్ మన్నా చర్చి పాస్టర్,రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ చెవాకుల జాన్ మోజెస్ (58)గుండెపోటుతో మృతి చెందారు.కొంత కాలంగా ఆయన ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం సాయంత్రం రాజేం ద్రనగర్ లోని చర్చి క్యాంపస్ లోని తన నివాసంలో అల్పాహారం తీసుకుంటుండగా గుండె నొప్పి వచ్చింది.ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించారని తెలిపారు. రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ కు భార్య సీహెచ్ ప్రభావతి,కుమారులు జాన్ సామ్యూల్,జాన్ సుందర్ పాల్ లు ఉన్నారు.కుమారులిద్దరు అమెరికాలో ఉంటున్న నేపథ్యంలో వారు భారతదేశానికి తిరిగి వచ్చాక శనివారం రాజేంద్రనగర్ లో సీహెచ్ జాన్ మోజెస్ సమాధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ మరణవార్త గురించి తెలుసుకున్న మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు,బిషప్ రేచల్ జ్యోతి కొమానపల్లి,మాసబ్ ట్యాంక్ రాక్ చర్చి సీనియర్ పాస్టర్ సిస్టర్ పి.విజయ దీవెన్,లతో పాటు పలువురు పాస్టర్లు,సంఘ విశ్వాసులు సిస్టర్ సీహెచ్ ప్రభావతిని పరమార్శిం చి సంతాపం తెలియజేశారు.

## కళాకారుడి కుటుంబానికి అండగా..నృత్య కళా సమాఖ్య



**మందమర్రి,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**కళాకారుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని మంచిర్యాల జిల్లా నృత్య కళా సమాఖ్య మరోసారి చాటిచెప్పింది.ఇటీవల మృతి చెందిన రిథమ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన డాన్సర్ గట్టు సాయికిరణ్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్ ఆ కుటుంబానికి ఆర్థిక,నిత్యావసర సహాయం అందించారు.3వ జోన్‌లోని సాయికిరణ్ నివాసానికి వెళ్లిన జిల్లా నృత్యకళా సమాఖ్య సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.సమాఖ్య తరఫున రూ.11వేల నగదు,50కిలోల బియ్యం అందజేసి కుటుంబానికి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్ మాట్లాడుతూ...కళా రంగానికి సేవలందించిన సాయికిరణ్ అకాల మరణం బాధాకరమన్నారు.ఆయన కుటుంబం ఒంటరిగా భావించాల్సిన అవసరం లేదని,కష్టకాలంలో సమాఖ్య సభ్యులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.కళాకారుల కుటుంబాలకు అవసరమైన సందర్భాల్లో సహాయం అందించేందుకు సమాఖ్య కృషి చేస్తుందని తెలిపారు.కళాకారుడి కుటుంబానికి సహాయం అందించడమే కాకుండా,తోటి కళాకారుడి కుటుంబం పట్ల తమ బాధ్యతను చాటుకున్న సమాఖ్య సభ్యులపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్ రామగిరి అర్జున్,అడ్డగురి లక్ష్మణ్,కొండపర్తి సది, వేల్పుల రమేష్,రమేష్ యాదవ్,ప్రశాంత్,సీనియర్ కళాకారుడు బబ్బర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో నార్కోటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు..



**బెల్లంపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని అరికట్టేందుకు బెల్లంపల్లి రెండో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ బృందంతో కలిసి కాల్‌టెక్స్ ప్రాంతం,రైల్వే స్టేషన్,బస్‌స్టాప్, దుకాణాలు, హోటళ్లు,పాన్‌షాపులు,సినిమా థియేటర్లలో సోదాలు చేపట్టారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా,వినియోగంపై నిఘా పెంచడంతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.ముఖ్యంగా యువత గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు, వాటి వినియోగం,రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నేత 'మదన్‌లాల్' ఆశయ సాధనలో మనీషాలక్ష్మి..

*బస్వాపురంలో హేమశ్రీ కుటుంబానికి పరామర్శ,*



**కారేపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**వైరా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ,ప్రతి ఒక్కరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అడుగుజాడల్లో వారి కుమార్తె, బిఆర్ఎస్ పార్టీ యువ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి పయనిస్తున్నారు.తండ్రి ఆశయాలను గుండెల్లో మోస్తూ..నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి నేనున్నానంటూ కొండంత అండగా నిలుస్తున్నారు.ఇందులో భాగంగా మంగళవారం కొణిజర్ల మండలం బస్వాపురం గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన హేమశ్రీ కుటుంబాన్ని బానోత్ మనీషాలక్ష్మి పరామర్శించారు. హేమశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఆమె స్వయంగా ఓదార్చారు.వారి చేతులు పట్టుకుని, కన్నీళ్లు తూడుస్తూ..”మా నాన్న ఎల్లప్పుడూ ప్రజల మనిషిగా బతికారు.ఆయన బిడ్డగా మీ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాను. అధైర్యపడకండి,మేమున్నాం”అని ధైర్యం చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గ్రామస్తులు,మహిళలు మనీషాలక్ష్మిలో మదన్‌లాల్ ని చూసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాముల వెంకటేశ్వర్లు,ఆర్ వి,రావూరి సురేష్,సాయి మరియు స్థానిక నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వారాసిగూడ నుంచి సీతాఫల్‌మండీ వరకు నిరసన ర్యాలీ...

*ప్రజలకు బాకీ కార్డుల జారీ చేస్తాం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్...*



**సికింద్రాబాద్,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలు,హామీలను అమలు చేయడంలో విఫలమైందని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం10 గంటలకు వారాసిగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండీ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు గ్యారెంటీ కార్డులు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం,వాటిలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెల్లించాల్సిన హామీలు బకాయిలను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజలకు బాకీ కార్డులు అందజేస్తామని పద్మారావు గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనకు చేరువవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ నెరవేరలేదని ఆయన విమర్శించారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, ఉద్యమ కారులు, మహిళలు,యువతీ యువకులు పెద్ద సంఖ్యలో వారాసిగూడాకు తరలివచ్చి నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు.

# పల్లె ప్యారడైజ్ కాలనీకి నూతన కార్యవర్గం..

*కాలనీ వాసుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నిక.. అభివృద్ధి,సంక్షేమానికి పెద్దపీట*

**కాప్రా,సెప్టెంబర్01(సూర్యరేఖ)** పల్లె ప్యారడైజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కాలనీ వాసులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది.మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో కాలనీ వాసులందరూ పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పల్లె ప్యారడైజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నంబర్ 330/2011). నూతన కార్యవర్గం.. అధ్యక్షులుగా ఆర్.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పి.లక్ష్మీరజని,ప్రధాన కార్యదర్శిగా కే.శ్రీనివాస్ గౌడ్,కోశాధికారిగా కే.శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి.రామారావు, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్.శ్రీకాంత్ గుప్తా, వై.రవీందర్ రెడ్డి,పి.రమణమూర్తి, ఎన్.గోపాల్ రెడ్డి,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ...తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.కాలనీ వాసుల ఐక్యత,సహకారంతో పల్లె ప్యారడైజ్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.కాలనీలో పరిశు భ్రత,పారిశుధ్యం,రోడ్లు, డ్రైనేజీ,వీధి దీపాలు,పార్కుల అభివృద్ధి,భద్రత, మౌలిక వసతుల మెరుగుదల తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ,కాలనీ



వాసుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల కాలనీ మాజీ అధ్యక్షులు ధన్ సాగర్ రెడ్డి హర్షం వ్యక్తం చేసి,సభ్యులకు అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్థలాన్ని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి..



**బెల్లంపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని నంబర్-2 ఇంక్లైన్ రడగంబాల బస్తీ 5వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో చెట్ల పెంపకానికి సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా కాపాడాలని కోరారు.ఇళ్లకు సమీపంలో చెట్లు, పొదలు పెంచడం వల్ల పాములు,తేళ్లు వంటి విషపురుగులు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కాలనీవాసుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యం చేపట్టాలనుకుంటున్న చెట్ల పెంపకాన్ని విరమించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాలు,కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

*రావిరాలలో వైభవంగా 43వ వార్షిక బోనాలు,కల్యాణ మహోత్సవాలు..*



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానంలో 43వ వార్షిక బోనాలు,కల్యాణ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ వ్యవస్థాపకుడు,ట్రస్టు చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషా లతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు .గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత,భక్తిభా వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని,ప్రతి కుటుంబం సుఖశాంతులతో,ఆనందంగా జీవించాలని కోరుకున్నారు.ఆలయ అభివృద్ధికి,ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.బోనాలు,కల్యాణ మహోత్సవాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో సందడిగా మారాయి.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,దేవాదాయ శాఖ అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు,భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## టోలిచౌకి పోలీస్ స్టేషన్లో పాండు ఎస్ఐ 10వేలు తీసుకుంటూ ఎసిబికి చిక్కాడు



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్01 (సూర్యరేఖ)** టోలిచౌకి పోలీస్ స్టేషన్ ఎస్సై పాండునాయక్ రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు .సెప్టెంబర్01 మంగళవారం హైదరాబాద్ సిటీ రేంజ్ 1ఏసీబీ అధికారులు వలపన్ని ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు.బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా ఉండటానికి,కుటుంబ తగాదాను పరస్పరం పరిష్కరించడానికి మరియు బాధితుడి పాస్‌పోర్ట్‌ను జప్తు చేయకుండా ఉండేందుకు ఎస్ఐ పాండు నాయక్ ఈ లంచాన్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.లంచం స్వీకరిస్తుండగా అధికారులు పట్టుకుని,అతడి వద్ద నుంచి 10వెల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.రసాయన పరీక్షల్లో లంచం తీసుకున్నట్లు రుజువు కావడంతో ఏసీబీ అధికారులు ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని,ఎస్ఐ పాండునాయక్‌ను అరెస్ట్ చేశారు. ఆయనను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపింది.ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే1064కు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు.ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

## అంజన్న సన్నిధిలో జనసేనని జన్మదిన వేడుకలు..



**కామారెడ్డి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు కొండగట్టు అంజన్నస్వామి సన్నిధిలో మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్ కాసరాజు పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం పటేల్ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ రాష్ట్ర జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థితెలంగాణ రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరై జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.ముందుగా లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు అర్చనలు జరిపారు.అనంతరం పవన్ కళ్యాణ్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం బృందావన్ గార్డెన్ లో అభిమానులు జనసేన పార్టీ నాయకులసమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగాఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ... నాపై నమ్మకంతో నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించినందుకు పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మీ అందరి సహకారంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచి శాసనమండలిలో ప్రజా సమస్యలపై పోరాడతానని ఆయన అన్నారు.రాష్ట్ర మున్నూరుకాపు సంఘం పటేల్ అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ... ప్రజారాజ్యం పార్టీ నుండి మెగా కుటుంబానికి తనకు అభినవ సంబంధం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్ కాసరాజు పటేల్ మాట్లాడుతూ...అంజన్న దీవెనలతో 2029లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తన ఆశ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో (రమేష్ పటేల్ వంగల),కాసా రాజు పటేల్,తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ పి. రామకృష్ణగౌడ్,రాష్ట్ర జనసేన నాయకులు,రాము తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పారదర్శకతకు సర్వపక్ష సహకారం అవసరం






శేరిలింగంపల్లిలో ఈఆర్వో నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో సర్వపక్ష సమావేశం

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్01(సూర్యరేఖ):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా,ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి,జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలేంపాటి ఐఏఎస్ ఆధ్వర్యంలో సర్వపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.జోనల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు,వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈఆర్వో నారాయణ్ అమిత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఓటర్ల నమోదు,మార్పులు,చేర్పులు,చిరునామా మార్పులు, మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.క్షేత్రస్థాయిలో అందుతున్న నమోదు,తొలగింపు,సవరణ దరఖాస్తుల పరిశీలన,డిజిటలీకరణ,ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన పలు అనుమానాలు,ఫిర్యాదులను ఈఆర్వో నారాయణ్ అమిత్ పరిశీలించారు.వాటి పరిష్కారానికి సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారులకు తక్షణమే దిశానిర్దేశం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని,ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియలో ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా,అనర్హులైన లేదా మరణించిన,వలస వెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి జాబితాను మరింత ప్రామాణికంగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు,సూపరింటెండెంట్లు,వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు,ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత అల్పాహార పథకం ప్రారంభం..





పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు.పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కాసేపు ముచ్చటించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన కూడా అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉదయాన్నే ఆకలితో పాఠశాలకు వస్తే వారి చదువుపై ఏకాగ్రత తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉదయం వేళల్లో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలరని,అందుకే విద్యతో పాటు వారి ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.చిన్నారులకు నాణ్యమైన,పౌష్టికమైన అల్పాహారం అందించడం ద్వారా వారిలో శారీరక,మానసిక ఉత్సాహం పెంపొందుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు,ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థులు ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే సమాజం,రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని,ప్రతి చిన్నారి మంచి విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించిన ఈ ఉచిత అల్పాహార పథకం నిరంతరం కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.విద్యార్థుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,విద్యాశాఖ అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు,స్థానిక నాయకులు,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## బద్లావ్ జరూరీ హై..రామ్‌లీలా మైదాన్‌లో సీపీఐ భారీ ధర్నా

లక్షలాది మందితో జరిగిన నిరసనలో పాల్గొన్న శంషాబాద్ సీపీఐ నేతలు



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భారతదేశ రాజధాని న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో భారీ ధర్నా నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు తరలివచ్చారు.లక్షలాది మంది పాల్గొన్న ఈ భారీ ధర్నాలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల సీపీఐ కార్యదర్శి నర్రగిరి,ఆర్. యాదగిరి,గిలక రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం,ధరల పెరుగుదల ,కార్మికులు ,రైతులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు,కర్షకుల హక్కుల పరిరక్షణ,ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచేందుకు 'బద్లావ్ జరూరీ హై' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన భారీ ధర్నా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల నిరసనకు ప్రతీకగా నిలిచిందన్నారు.

## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ గా రవిప్రసాద్



**మెహదీపట్నం,సెప్టెంబర్01(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ గా ఎస్ రవి ప్రసాద్ పదవి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మెహిదీపట్నంలోని నాన్ననగర్ లో గల విద్యుత్తు ఎస్ఇ కార్యాలయంలో పూర్వపు ఎస్ఈ, ఫ్రీగా పదోన్నతి పొందిన శ్రీరామ్మోహన్ నుండి ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర పవర్ ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షులు, రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్ రావు, కందుకూరు డిఈ గోపాలకృష్ణ,లు ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు.వికారాబాద్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ గా పనిచేసిన రవిప్రసాద్ బదిలీపై రాజేంద్రనగర్ సర్కిల్ కు వచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఏవో రవీందర్,మెహదీపట్నం డిఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన 80టన్నుల ఇసుకకు బహిరంగ వేలం..

సెప్టెంబర్ 8న వేలం..రూ.5వేల డీడీతో ముందస్తుగా నమోదు చేసుకోవాలి..

తహసీల్దార్ జ్ఞానజ్యోతి



**మసాయిపేట,సెప్టెంబర్ 01(సూర్యరేఖ)** హకీంపేట్ గ్రామ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 80టన్నుల ఇసుకను గతంలో గిర్దవర్ ధన్‌సింగ్ సీజ్ చేసినట్లు తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు.సీజ్ చేసిన ఇసుకను ప్రస్తుతం మసాయిపేట తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు.సీజ్ చేసిన ఇసుకను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సెప్టెంబర్ 8,2026న ఉదయం11 గంటలకు ఇసుక వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు.వేలంలో పాల్గొనదలచిన మసాయిపేట మండల ప్రజలు ముందస్తుగా రూ.5,000డీడీ రూపంలో చెల్లించి, సంబంధిత డీడీని సెప్టెంబర్ 7,2026 సాయంత్రం 4 గంటలలోపు మసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన తేదీ, సమయానికి సీజ్ చేసిన ఇసుక నిల్వ ఉన్న జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రాంగణానికి హాజరుకావాలని అధికారులు కోరారు.ఇసుక వేలం ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు.

## ప్రభుత్వ వైఫల్యలపై 420పై బీఆర్ఎస్ పోరుబాట..

సెప్టెంబర్ 2నుంచి వరస నిరసనలకు పిలుపు.!



**నారాయణపేట ,సెప్టెంబర్01 (సూర్యరేఖ)**రాష్ట్రంలో 1000రోజుల కాగ్రెస్ ప్రభుత్వ పాలనా వైపల్యలను ప్రజల్లో ఎండగట్టెందుకు ప్రతిపక్ష భారత రాష్ట్రయ సమితి బీఆర్ఎస్ పోరుబాటుకు సిద్దమైంది.ఇచ్చిన హామీల ను అమలు చేయడంలో సర్కార్ విఫ లమైనదంటూ సెప్టెంబర్ 2నుంచి రాష్ట్రవేప్త ంగా వరుస నిరసన కార్యక్ర మాలు చేపట్టేందుకు బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి పిలుపునించిది.రేపు ఉదయం 10గంటలకు ఓల్డ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యాద్దిర్ రోడ్ నుండి స్థానిక సత్యనారాయణ చౌరాస్తా వరకు ర్యాలీ, నిరసన కార్యక్రమం మరియు బాకీ కార్డుల పంపిణి కలదు ఇట్టి కార్యక్రమానికి బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు రాజేందర్ రెడ్డి, మండలం గ్రామం వార్డుల నుండి హాజరై విజయవంతం చేయాలని కోరారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల పర్యటన..

**లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో సమస్యలపై ఆరా..**






**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు మంగళవారం పర్యటించారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ,టి.ప్రేమ్‌గౌడ్,కళ్లెం లక్ష్మారెడ్డి, బొల్ల వెంకటేశ్వర్లు,ఆంజనేయులుగౌడ్,ఏసు,ఎంజాల శేఖర్ ,అశోక్, జగ్గు,విజయ్,మానస తదితర కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు కాలనీ వాసులతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీ వాసులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.మౌలిక వసతులు,పారిశుద్ధ్యం,రోడ్లు, తాగునీరు తదితర అంశాలపై స్థానికులతో చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు.కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు,స్థానిక ప్రజలు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశ్రీ హిల్స్‌లో పోచమ్మ తల్లి 5వ వార్షికోత్సవ వేడుకలు..





**బండ్లగూడ,సెప్టెంబర్01(సూర్యరేఖ)**బండ్లగూడ జాగీర్ పరిధిలోని 121వ డివిజన్ పద్మశ్రీ హిల్స్‌లో శ్రీ పోచమ్మ తల్లి 5వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ మహేందర్‌గౌడ్,రాజు యాదవ్,మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ ఆలయ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు .అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని కోరుకున్నారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు,స్థానిక ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి..

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,సెప్టెంబర్01(సూర్యరేఖ)**జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎ.ఓ.రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బద్లావ్ జరూరీ హై..మార్పు కావాలి

**ఎరుపెక్కిన రామ్‌లీలా మైదాన్..ఢిల్లీకి బయలుదేరిన సీపీఐ తెలంగాణ నేతలు..**



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం,విపరీతంగా పెరుగుతున్న ధరలు,ప్రజాస్వామ్య హక్కుల హననం,కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టారు.సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించనున్న 'బద్లావ్ జరూరీ హై..మార్పు కావాలి' పేరుతో నిర్వహించే జాతీయ స్థాయి నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర నేతలు,కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్సీ సత్యం,సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి,జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్యగారి నర్సింహారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యుడు జే.ఆనంద్‌గౌడ్,రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె.విజయ్ ఆనంద్‌గౌడ్,మండల బీసీ అధ్యక్షుడు జే.సదానంద్‌గౌడ్ తదితరులు ఢిల్లీకి బయలుదేరిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల,విద్వేషపూరిత విధానాల కారణంగా కార్మికులు,కర్షకులు, యువత,నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్య,మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని అన్నారు.కార్మికులు,రైతుల హక్కులను పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం,ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి రాజకీయ పార్టీ,ప్రజా సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.దేశాన్ని ప్రజాస్వామ్య మార్గంలో నడిపించేందుకు,ప్రజల హక్కులను కాపాడేందుకు 'బద్లావ్ జరూరీ హై..మార్పు కావాలి' సభ చారిత్రాత్మక మలుపుగా నిలవనుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం నుంచి ఢిల్లీకి తరలివెళ్లిన ప్రతినిధి బృందం రామ్‌లీలా మైదాన్‌లో జరిగే జాతీయ స్థాయి నిరసన ప్రదర్శనలో క్రియాశీలకంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పనుందని స్పష్టం చేశారు.దేశ ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడంతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు.

# వ్యవసాయ నాయకత్వ అభివృద్ధికి సంస్థాగత భాగస్వామ్యాలు కీలకం






**ఘనంగా ఐసీఏఆర్-నార్మ్ 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ):** ప్రస్తుత జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ పరిస్థితుల్లో సంస్థాగత భాగస్వామ్యాలను బలోపేతం చేయడంతో పాటు పరిశోధకుల నుంచి నాయకత్వ స్థాయికి మార్పును ప్రోత్సహించడం అత్యవసరమని పద్మభూషణ్ డాక్టర్ ఆర్.ఎస్.పరోడా,భారత వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డైరెక్టర్ జనరల్ పేర్కొన్నారు .హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమీలో ఐసీఏఆర్-నార్మ్ 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పరోడా డాక్టర్ కె.వి.రామన్ స్మారక ఉపన్యాసాన్ని ప్రారంభించి ప్రసంగించారు .పరిశోధకులకు శిక్షణ అందించే సంస్థగా మాత్రమే పరిమితం కాకుండా నాయకులను తీర్చిదిద్దే,అభివృద్ధి చేసే సంస్థగా నార్మ్ పరివర్తనం చెందాల్సిన అవసరం ఉందన్నారు.బృందపని,క్రమశిక్షణ,వ్యవస్థల సమగ్ర ఆలోచనా విధానం,సంస్థలో నిరంతర అంతర్గత పరివర్తనకు బలమైన సంస్కృతిని పెంపొందించడం అత్యంత కీలకమని తెలిపారు.సుస్థిరమైన, అర్థవంతమైన మార్పు సంస్థ నుంచే ప్రారంభం కావాలని స్పష్టం చేశారు.నార్మ్ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు అకాడమీలు,విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలను విస్తరించాలని సూచించారు.ముఖ్యంగా దక్షిణ-దక్షిణ సహకారానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.భవిష్యత్తులో నార్మ్ అనుసరించాల్సిన కార్యాచరణ ప్రణాళికలో ఐదు కీలక అంశాలను ఆయన సూచించారు.వ్యవసాయ నాయకత్వ అభివృద్ధి కేడర్‌ను సమీక్షించి నిర్వహణ నిపుణులను నియమించడం,అందుబాటులో ఉన్న వనరులతో భవిష్యత్ దృక్పథ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం,ఆవిష్కరణలను ఆలోచనల స్థాయి నుంచి ప్రయోగాత్మక నమూనా,మేధో సంపత్తి హక్కుల దిశగా తీసుకెళ్లడం,బాధ్యతాయుత డిజిటల్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవసాయ శాస్త్రం ప్రభావ అంచనాను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ ప్రాధాన్యతా అంశాలు సమాజానికి నార్మ్ అందించే సేవలను మరింత విస్తరించడంతో పాటు వ్యవసాయ నాయకత్వం,సామర్థ్య అభివృద్ధిలో ప్రముఖ సంస్థగా దాని పాత్రను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.డాక్టర్ మాంగి లాల్ జాట్,డేర్ కార్యదర్శి,ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలు,డిజిటల్ పరిజ్ఞానం,నిర్వహణ సామర్థ్యాలతో కూడిన మానవ వనరులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.మానవ వనరుల అభివృద్ధిలో వ్యూహాత్మక పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు.నార్మ్ ప్రధానంగా నిర్వహణ,సామర్థ్య నిర్మాణం,సంస్థాగత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.అకాడమీ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేయడంతో పాటు జాతీయ అకాడమీలు ,వ్యవసాయ విశ్వవిద్యాలయాలు,కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాల యాలతో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ రంగంలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం,వ్యవసాయ వ్యవస్థలో సామర్థ్య నిర్మాణ అవసరాలను పద్ధతిశీలంగా అంచనా వేయడం అత్యవసరమని అన్నారు.పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా సమీక్షించి అవసరాలకు అనుగుణంగా సవరించడం ద్వారా పరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులను అభివృద్ధి చేయాలని సూచించారు.విస్తృత సంస్థాగత వినియోగం కోసం సమగ్ర శిక్షణ,నిపుణుల వివరాల సమాహారాలను రూపొందించాలని తెలిపారు.డిమాండ్ ఆధారిత శిక్షణ కార్యక్రమాలు,డేటా ఆధారిత సామర్థ్య నిర్మాణం ద్వారా విలువ ఆధారిత,సుస్థిర వ్యవసాయ-ఆహార వ్యవస్థల వైపు మార్పును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఐసీఏఆర్ ఉప డైరెక్టర్ జనరల్ విద్య డాక్టర్ యశ్‌పాల్ సింగ్ మాలిక్ ఆన్‌లైన్‌లో పాల్గొని ప్రసంగిస్తూ కృత్రిమ మేధస్సు,భారీ స్థాయి తెరచిన ఆన్‌లైన్ కోర్సులు,డిజిటల్ ఆధారిత అభ్యాస వ్యవస్థ అభివృద్ధి వంటి సమకాలీన అంశాలపై అకాడమీ చేస్తున్న కృషిని అభినందించారు.నాయకత్వ అభివృద్ధి,సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.నార్మ్‌కు చెందిన వ్యవసాయ వ్యాపార అభివృద్ధి ఇంక్యుబేషన్ సదుపాయం చేస్తున్న కృషిని ప్రశంసించారు.వ్యవసాయ వ్యాపారవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో 100 విజయవంతమైన అంకుర సంస్థలను సృష్టించాలనే లక్ష్యాన్ని అభినందించారు.'వికసిత్ భారత్-2047 కోసం వ్యవసాయ పారిశ్రామికవేత్తల అభివృద్ధి' అనే ఇతివృత్తానికి అనుగుణంగా అకాడమీ 50 ఏళ్ల ప్రస్థానం,ప్రధాన విజయాలు,భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం.సుందరం వివరించారు.అంతకుముందు నార్మ్ సంయుక్త సంచాలకుడు డాక్టర్ గోపాల్ లాల్ సభకు స్వాగతం పలికారు.సుస్థిర వ్యవసాయం,సాంకేతికత తదితర అంశాలపై రూపొందించిన పలు ప్రచురణలు,విధాన పత్రాలు,సాంకేతిక నివేదికలను ఈ సందర్భంగా విడుదల చేశారు.జ్ఞానాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చివరి స్థాయి వరకు సమాచారాన్ని చేరవేసే 'ఫార్మర్స్ వాల్ట్' పోర్టల్,'నార్మ్ లైబ్రరీ' యాప్‌లను ప్రారంభించారు.సంస్థాగత,క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో విశిష్ట సేవలు అందించిన శాస్త్రీయ,సాంకేతిక,పరిపాలనా,ఆర్థిక విభాగాలకు చెందిన నార్మ్ సిబ్బందిని ప్రశంసాపత్రాలు,పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమ నిర్వాహక కార్యదర్శి,నార్మ్ ఆర్ఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ వి.రామసుబ్రమణియన్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో నార్మ్ సిబ్బంది,మాజీ డైరెక్టర్లు,మాజీ సంయుక్త సంచాలకులు ,హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ సంస్థల అధిపతులు,వ్యవసాయ,ఉద్యానవన,పశు వైద్య విశ్వవిద్యాలయాల ఉపకులపతులు,నార్మ్ ప్రాజెక్టు సిబ్బంది,పీజీడీఎం-ఏబీఎం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆందోల్ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష..






**బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి 100శాతం ఓటర్ల నమోదు లక్ష్యాన్ని సాధించాలి**

**మెదక్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** ఆందోల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు.సంగారెడ్డిలోని తన నివాసంలో బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏలు)తో అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ రెండో దశపై వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలను బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు)కు సకాలంలో అందించేలా బీఎల్ఏలు సహకరించాలని సూచించారు.ఆందోల్ నియోజకవర్గంలో 100శాతం ఓటర్ల నమోదు, డిజిటలైజేషన్ లక్ష్యంగా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిజిటలైజేషన్ కాని ఓటర్లకు అందిన నోటీసుల వివరాలను బూత్‌ల వారీగా వెంటనే సేకరించి, వారికి అవసరమైన ధ్రువపత్రాలను బీఎల్ఓలకు అందించడంలో పూర్తి సహకారం అందించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.నోటీసులు అందుకున్న ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ,నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలను బీఎల్ఓలకు అందించి ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా బీఎల్ఏలు కృషి చేయాలని మంత్రి కోరారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను కూడా బూత్ లెవెల్ అధికారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను ఆందోల్ నియోజకవర్గంలో 100శాతం విజయవంతం చేసేందుకు బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు బీఎల్ఏలు చేస్తున్న కృషిని మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో పీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సంగమేశ్వర్,జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి,సురేందర్ గౌడ్,ఏఎంసీ చైర్మన్లు జగన్ మోహన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి, ఆందోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్, దుర్గారెడ్డి,దిగంబర్ రావు,నిమ్మ రమేష్,విశ్వాస్, డాకూర్ వెంకటేష్,కౌన్సిలర్లు,మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మర్రి అరుణ,ఇతర ప్రజాప్రతినిధులు, సర్పంచులు,ముఖ్యనాయకులు,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లకు ఒప్పంద రూపంలో ఫలితం..

**32డిమాండ్లలో 23సాధించాం..**

**మిగతావాటిపై సర్క్యులర్లకు అంగీకారం..**

**ఏఐటీయూసీ నాయకులు**



**మందమర్రి,సెప్టెంబర్01(సూర్యరేఖ)**సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ చేపట్టిన ఉద్యమం ద్వారా పలు కీలక డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు తెలిపారు. మంగళవారం మొదటి షిఫ్టులో మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ,బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్,బీపీఎల్ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఆర్ఎల్‌సీ సమక్షంలో ఈనెల 27న యాజమాన్యంతో జరిగిన చర్చల్లో సమ్మె నోటీసులో పేర్కొన్న 32డిమాండ్లలో 23 డిమాండ్లను సాధించుకున్నామని వెల్లడించారు. సింగరేణి ఉద్యోగులకు చాలాకాలంగా సమస్యగా ఉన్న పెర్క్స్‌పై ఇన్‌కమ్‌ట్యాక్స్ అంశంపై తాజా చర్చల్లో పరిష్కార దిశగా ఒప్పందం కుదరడం ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు.కోల్ ఇండియాలో అమలవుతున్న విధానాన్ని సింగరేణిలోనూ అమలు చేయాలని కార్మికులు చాలాకాలంగా కోరుతున్నారని తెలిపారు.ఈ అంశం గతంలో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుత చర్చల ద్వారా దానిని సాధించగలిగామని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు.దీనిని కార్మిక వర్గానికి ప్రయోజనం చేకూర్చే నిర్ణయంగా అభివర్ణించారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా అందించే అంశంపైనా చర్చల్లో స్పష్టత వచ్చిందని నాయకులు తెలిపారు.దసరా పండుగ నాటికి లాభాల్లో వాటాను ప్రకటించేలా ఒప్పందం జరిగిందన్నారు.మిగిలిన డిమాండ్లకు సంబంధించి యాజమాన్యం సర్క్యులర్ల రూపంలో ఉత్తర్వులు జారీ చేయడానికి అంగీకరించిందని చెప్పారు. ఒప్పందంపై కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న విమర్శలను ఏఐటీయూసీ నాయకులు తప్పుబట్టారు.కార్మికులకు ప్రయోజనం చేకూర్చే అంశాలను పక్కనపెట్టి ఒప్పందాన్ని వ్యతిరేకంగా ప్రచారం చేయడం సరికాదన్నారు.కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని,భవిష్యత్తులోనూ హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సింగరేణిలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీకి కార్మికుల మద్దతు ఉందని,నాలుగుసార్లు గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఘనత తమ సంఘానికి ఉందని నాయకులు గుర్తుచేశారు.కార్మికుల హక్కుల కోసం అవసరమైతే త్యాగాలకు సైతం సిద్ధంగా ఉంటామని తెలిపారు. పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు సోమిశెట్టి రాజేశం,పెద్దపెల్లి బానయ్య,టేకుమట్ల తిరుపతి,పిట్ కార్యదర్శి సీహెచ్‌పీ శర్మ,వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్‌సింగ్,పిట్ నాయకులు పంగ చంద్రశేఖర్,ప్రేమ్‌లాల్,సట్ల కొండయ్య ,కాసం సమ్మయ్య ,భగవాన్‌రెడ్డి,హేమచందు,ఊరుకొండ శ్రీకాంత్,గుగ్లోత్ రాంబాబు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి కాంగ్రెస్ అండ..



**మందమర్రి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** పేద కుటుంబానికి ఆపద సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది.పట్టణంలోని 19వ వార్డుకు చెందిన సుంకరి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది.ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు.బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించి రూ.10వేల ఆర్థిక సహాయం అందించాలని సూచించారు.దీంతో పట్టణ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల నగదు సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నాయకులు.. కష్టకాలంలో మంత్రి వివేక్ వెంకటస్వామి,కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొతుకు సుదర్శన్ రావు,మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్‌గౌడ్,మంకు రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఎండీ హఫీజ్, నాయకులు ఆకారం రమేష్,బుర్ర ఆంజనేయులు, అంకం రాజ్‌కుమార్,కత్తి రమేష్,ఇసాక్,కె.కనకయ్య, నారా లింగయ్య,ఏటూరు సత్యనారాయణ, బొంగోని కేశవ్,మాయ తిరుపతి,రమాకాంత్,పట్టణ మీడియా,కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జి చిప్పకుర్తి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## నిన్నటి వరకు జీతాల కోసం ఎదురుచూపులు ..నేడు ఉద్యోగాల నుంచే తొలగింపు..

**ఇంతకంటే దుర్మార్గం ఏముంటుంది.?**

**మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూటి ప్రశ్న..**



**మెదక్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే ఆరోగ్యశ్రీలో 22ఏళ్లుగా సేవలందిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లను(డీఈఓలు)విధుల నుంచి తొలగించడం దురదృష్టకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు.దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను ఒక్క నిర్ణయంతో రోడ్డున పడేయడం న్యాయమా.? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.తగిన జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోయినా ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ ఆరోగ్యశ్రీ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉపాధిని దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న డీఈఓలను విధుల నుంచి తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.డీఈఓల సుదీర్ఘ అనుభవాన్ని,వారు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించాలని హరీశ్‌రావు కోరారు.ఏళ్ల తరబడి పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తే వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.ఉద్యోగాల నుంచి తొలగించే బదులు ఇతర ప్రభుత్వ విభాగాలు లేదా సంక్షేమ పథకాల్లో వారికి అవకాశం కల్పించి,వారి సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే పునఃపరిశీలించి,ఆరోగ్యశ్రీ డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని,వారి కుటుంబాలకు అండగా నిలిచి న్యాయం చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## తప్పిపోయిన వృద్ధులను కుటుంబ సభ్యులకు అప్పగించిన చిలకలగూడ పోలీసులు





**చిలకలగూడ,సెప్టెంబర్ 01(సూర్యరేఖ)**తప్పిపోయి ఆశ్రయం పొందుతున్న ఇద్దరు మహిళల ఆచూకీ కనుగొని,వారిని కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంలో చిలకలగూడ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు.ఆగస్టు 31న చిలకలగూడ పరిధిలో కనిపించిన బాలమణి,గోవిందమ్మలను పోలీసులు తొలుత డ్రీమ్ ఇండియా హోమ్‌లో చేర్పించారు. అనంతరం వారి వివరాలు,ఫోటోల ఆధారంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా విచారణ చేపట్టారు.ఈ క్రమంలో సమాచారం అందుకున్న గోవిందమ్మ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తగిన వివరాలు అందించి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.మరోవైపు వికారాబాద్‌కు చెందిన బాలమణి ఫోటోను పత్రికల్లో చూసిన ఆమె కుటుంబ సభ్యులు వెంటనే చిలకలగూడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.వారి గుర్తింపును ధృవీకరించుకున్న పోలీసులు డ్రీమ్ ఇండియా హోమ్ నుంచి బాలమణిని తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు.ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ చొరవ తీసుకుని ఇద్దరు మహిళలను వారి కుటుంబాల వద్దకు క్షేమంగా చేర్చారు.తమ వారిని సురక్షితంగా అప్పగించినందుకు బాధితుల కుటుంబ సభ్యులు చిలకలగూడ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రామచంద్రరావు హౌస్ అరెస్ట్

**హైదరాబాద్ :** నల్గొండలో రాజకీయాలు మరోసాయి వేడెక్కాయి. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మొదలైన మాటల యుద్ధం, దాడుల వరకు వెళ్లడంతో ఉద్రిక్తతలకు దారితీశాయి. బీజేపీ నేత డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఉన్న రామచందర్ రావు నివాసంలో పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యగా ఆయనను హౌస్ అరెస్టు చేశారు. పోలీసులతో బీజేపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. నల్గొండ జిల్లాలో ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేశాయి. అందుకు ప్రతిచర్యగా నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# అత్యాశ..భయం..తొందరపాటు..సైబర్ నేరగాళ్లకు ఆయుధాలు

**ఒక్క క్లిక్‌తో..జీవితాన్ని మార్చేస్తున్న సైబర్ మోసాలు**

**అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్..**

**ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్**

**మెదక్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్01(సూర్యరేఖ)** చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు..ప్రపంచమే అరచేతిలోకి వచ్చినట్లుగా మారిపోయింది. బ్యాంకింగ్ నుంచి షాపింగ్ వరకు..నగదు బదిలీల నుంచి ప్రభుత్వ సేవల వరకు అన్నీ క్షణాల్లో పూర్తవుతున్నాయి.అయితే ఇదే ఆధునిక సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఒక్క ఫోన్‌కాల్..ఒక్కలింక్..ఒక్క ఓటీపీతో జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్మును క్షణాల్లో ఖాళీ చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారానే సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచించారు. సైబర్ నేరగాళ్ల ప్రధాన ఆయుధాలు ప్రజల నమ్మకం, భయం,అత్యాశ,తొందరపాటు అని ఎస్పీ పేర్కొన్నారు.బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి ఖాతా బ్లాక్ అవుతుందని భయపెట్టడం.. పోలీసులమంటూ కేసు నమోదైందని బెదిరించడం.. ఉద్యోగం ,లోన్,లాటరీ,భారీ బహుమతుల పేరుతో ఆశ చూపించడం వంటి వివిధ మార్గాల్లో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. కొన్నిసార్లు తెలిసిన వ్యక్తుల ఫొటోలు,పేర్లను సోషల్ మీడియాలో ఉపయోగించి అత్యవసరంగా డబ్బులు పంపాలని కోరుతున్నారని చెప్పారు.భయంతోనో.. అత్యాశతోనో..తొందరపాటుతోనో స్పందించిన క్షణమే మోసగాళ్లకు అవకాశం దొరుకుతుందని హెచ్చరించారు.బ్యాంకు ఖాతా వివరాలు,ఏటీఎం పిన్,ఓటీపీ,యూపీఐ పిన్,పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ఎస్పీ స్పష్టం చేశారు.బ్యాంకులు ,పోలీసుశాఖ లేదా ప్రభుత్వ సంస్థలు ఫోన్ ద్వారా ఓటీపీ, పిన్,పాస్‌వర్డ్ వంటి వివరాలను అడగవని గుర్తుంచుకోవాలన్నారు. గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం, ఇతరులతో మొబైల్ స్క్రీన్ షేర్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ఏదైనా అనుమానాస్పద ఫోన్‌కాల్ లేదా సందేశం వస్తే వెంటనే అప్రమత్తమై సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.

**మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి..**

సైబర్ మోసానికి గురైన తర్వాత భయంతో మౌనంగా ఉండొద్దని ఎస్పీ




సూచించారు.డబ్బు పోయిన వెంటనే 1930నంబర్‌కు కాల్ చేసి,ఆలస్యం చేయకుండా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు.సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదు తదుపరి ఖాతాలకు బదిలీ కాకుండా నిలిపివేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి నిమిషం ఆలస్యం కూడా బాధితుడి నష్టాన్ని పెంచే అవకాశం ఉందని హెచ్చరించారు.సైబర్ నేరాల నుంచి రక్షణ పొందడం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని..ప్రతి కుటుంబం,ప్రతి మొబైల్ వినియోగదారుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేయాలి కానీ సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇవ్వకూడదన్నారు.క్లిక్ చేసే ముందు ఆలోచించండి..వివరాలు చెప్పే ముందు ఒక్కసారి ఆగండి..అనుమానం వస్తే వెంటనే అప్రమత్తం అవ్వండి..అవసరమైతే పోలీసులను సంప్రదించండి. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరగాళ్లకు అసలైన అడ్డుకట్ట అని ఎస్పీ పేర్కొన్నారు.

# బహిరంగ మద్యం సేవిస్తే కఠిన చర్యలు..

**డీజేలు,అనుమతి లేని డ్రోన్లపైనా నిషేధం..**

**ధర్నాలు,ర్యాలీలు,రాస్తారోకోలకు పోలీసుల అనుమతి తప్పనిసరి..**

**అక్టోబర్ 1వరకు నిషేధాజ్ఞలు అమలు..**

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల,సెప్టెంబర్01,(సూర్యరేఖ)** ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,అనుమతి లేకుండా డీజేలు,డ్రోన్లు వినియోగించడంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నాయని సీపీ తెలిపారు.మద్యం మత్తులో వీధులు,రహదారులపై అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల సాధారణ ప్రజలు,ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**డీజేలకు అనుమతి తప్పనిసరి..**

చిన్నారులు,వృద్ధులు,రోగులు,విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధిక శబ్దంతో డీజేలు వినియోగించడంపై నిషేధం విధించినట్లు సీపీ వెల్లడించారు.ఏదైనా కార్యక్రమంలో మైక్ సెట్ వినియోగించాల్సి ఉంటే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే బీఎన్ఎస్ సెక్షన్ 223,హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

**డ్రోన్ల వినియోగంపై నిఘా..**

అనుమతి లేకుండా డ్రోన్లు వినియోగించే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజా భద్రతకు విఘాతం కలిగించే విధంగా డ్రోన్లను వినియోగించరాదని సూచించారు.

**ధర్నాలు,ర్యాలీలకు ముందస్తు అనుమతి..**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో సిటీ పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సెప్టెంబర్ 1ఉదయం 6గంటల నుంచి అక్టోబర్ 1 ఉదయం 6గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.ఈ సమయంలో ధర్నాలు, ర్యాలీలు,రాస్తారోకోలు,సభలు,సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం,బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా కోరారు.

## తెలంగాణ రక్షణ సేనకు బిగ్ షాక్

**బీజేపీలో చేరేందుకు సిద్ధమైన రామిరెడ్డి..**

**ఈటల రాజేందర్ తో కీలక భేటీ...**

**మేడ్చల్?మల్కాజిగిరి రాజకీయాల్లో కీలక పరిణామం.**

**త్వరలోనే కమలం గూటికి చేరుతానని రామిరెడ్డి స్పష్టీకరణ**

**మేడ్చల్ మల్కాజిగిరి :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి తెరలేచింది. తెలంగాణ రక్షణ సేనకు చెందిన మేడ్చల్?మల్కాజిగిరి నాయకుడు రామిరెడ్డి వెంకట్రెడ్డి బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నేడు కార్యకర్తలు, అనుచరులతో నిర్వహించిన భేటీలో ఆయన త్వరలోనే భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు స్పష్టం చేసినట్లు సమాచారం.తెలంగాణ రక్షణ సేనలో కీలకంగా పనిచేస్తున్న నాయకుడు బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధమవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల్లో పార్టీని విస్తరించేందుకు తెలంగాణ రక్షణ సేన కార్యక్రమాలు చేపడుతున్న సమయంలో మేడ్చల్?మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ముఖ్య నాయకుడి వైదొలగింపు ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ రక్షణ సేనకు ఎదురుదెబ్బ?కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకుంటూ సంస్థాగతంగా బలోపేతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇలాంటి సమయంలో మేడ్చల్?మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన రామిరెడ్డి వెంకట్రెడ్డి బీజేపీలో చేరతానని ప్రకటించడం తెలంగాణ రక్షణ సేనకు స్థానికంగా ఎంతమేర ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.రామిరెడ్డి బీజేపీలో చేరికతో మేడ్చల్?మల్కాజిగిరి రాజకీయ సమీకరణాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో.. ఆయన వెంట ఎంతమంది అనుచరులు కమలం గూటికి చేరుతారో వేచి చూడాలి....

## సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఉద్యోగులు సిద్ధం కావాలి..

**సెప్టెంబర్ 3లోగా పేర్ల నమోదు..19క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపికలు**

**మంచిర్యాల,సెప్టెంబర్01(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా ప్రతిభను చాటుకునేందుకు అవకాశం లభించింది. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ (ఎఐసిఎస్) క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసేందుకు మంచిర్యాల జిల్లాలో వివిధ క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన,క్రీడల అధికారి (డివైఎస్ఓ)మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అథ్లెటిక్స్,బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్,క్రికెట్,చెస్,క్యారమ్స్,ఫుట్‌బాల్, హాకీ,కబడ్డీ,లాన్ టెన్నిస ,పవర్ లిఫ్టింగ్,స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్,వాలీబాల్,వెయిట్ లిఫ్టింగ్,రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్,యోగా,ఖో-ఖో తదితర 19క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని అధికారులు స్పష్టం చేశారు. క్రీడలపై ఆసక్తి,ప్రతిభ కలిగిన ఉద్యోగులు తాము పాల్గొనదలచిన క్రీడాంశాన్ని పేర్కొంటూ 2026 సెప్టెంబర్ 3వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని డివైఎస్ఓ సూచించారు.నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం,పోటీల తేదీలు తదితర వివరాలను తెలియజేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అర్హులైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా పేర్లు నమోదు చేసుకోవాలని, నమోదు, వివరాల కోసం రాజేష్ ఫోన్ నంబరు 99635 39234 సంప్రదించాలని కోరారు.

## కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యాన్ని ఎండగడతాం..


**రేపు శంషాబాద్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన..**



**రాజేంద్రనగర్,సెప్టెంబర్01(సూర్యరేఖ)**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని,అయితే అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు సమీపిస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలులో ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపుమేరకు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తెలిపారు.సెప్టెంబర్02న ఉదయం 11 గంటలకు శంషాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన తీరును నిరసిస్తూ చేపట్టనున్న ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సమావేశం నిర్వహించి నిరసన కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు.ఈ సమావేశంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్,గుమ్మడి కుమార్‌తో పాటు రాము యాదవ్,మహేష్‌రెడ్డి,ప్రవీణ్, కాటేదాన్ కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శీను,సరికొండ దుర్గేష్, చిరంజీవి, అశోక్‌కుమార్,శేఖర్,చిన్న,ప్రదీప్,సునీల్,బొంబాయి రవి,సరిత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలాన్ల నుంచి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ టాంపరింగ్..

**వ్యక్తిపై భీమారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**



**చెన్నూర్,సెప్టెంబర్ 01(సూర్యరేఖ)** పోలీస్ చలాన్ల నుంచి తప్పించుకునే ఉద్దేశంతో వాహనం నంబర్ ప్లేట్‌ను టాంపరింగ్ చేసి,అసలు రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించకుండా చేసిన పి.జంపయ్యపై భీమారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.రాజేందర్ తెలిపారు.వాహనం నంబర్ ప్లేట్‌లో మార్పులు చేసినట్లు పోలీసులు గుర్తించారు.పోలీస్ చలాన్లను తప్పించుకునే ఉద్దేశంతోనే నంబర్ ప్లేట్‌ను ఉద్దేశపూర్వకంగా టాంపరింగ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు.వాహనం నంబర్ ప్లేట్‌ను మార్చడం,టాంపరింగ్ చేయడం లేదా రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించకుండా చేయడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వాహనదారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రామాణిక నంబర్ ప్లేట్‌ను వినియోగించాలని,నంబర్ ప్లేట్‌పై ఎలాంటి మార్పులు చేయరాదని ఎస్ఐ ఎ.రాజేందర్ సూచించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713